# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 14 సంచిక:6 | వరంగల్, 4-6-2026, గురువారం | పేజీలు: 8 | వెల: 1.00


## బడిబాట పేద విద్యార్థులకు భవిష్యత్తుకు బంగారు బాట

ఊరుకొండ ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమం పేద విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట అని ఊరుకొండ పేట సర్పంచ్ అబ్దుల్ రషీద్ అన్నారు. బుధవారం ఊరుకొండ మండలంలోని ఊరుకొండ పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల విద్యాధికారి అబ్దుల్ రహీం అధ్యక్షతన బడిబాట వాల్ పేపర్లు విడుదల చేశారు.




## తెలంగాణ ఇన్-సర్వీస్ టీచర్లకు గుడ్ న్యూస్..

## ప్రత్యేక టెట్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, జూన్ 03: తెలంగాణ రాష్ట్రంలో సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు రేవంత్ సర్కార్ తీపి కబురు అందించింది. రాష్ట్రంలోని ఇన్-సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేక ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సాధారణంగా ప్రతి ఏటా నిర్వహించే రెండు టెట్ పరీక్షలకు అదనంగా.. మరో రెండు ప్రత్యేక టెట్ పరీక్షలను నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది.

పూర్తిగా సర్వీసులో ఉన్న ఉపాధ్యాయుల ప్రయోజనాల కోసమే ఈ ప్రత్యేక టెట్ పరీక్షలను ప్రభుత్వం తలపెట్టింది. గత కొంతకాలంగా ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్న విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం.. ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రత్యేక టెట్ నిర్వహణకు సంబంధించి అధికారిక ఉత్తర్వులను కూడా జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో.. ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించి తదుపరి అవసరమైన అన్ని చర్యలనూ తక్షణమే చేపట్టాలని విద్యాశాఖ డైరెక్టర్‌కు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## భూముల మార్కెట్ విలువల సవరణకు TG ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం భూములు, ప్లాట్లు, ఫ్లాట్ల మార్కెట్ విలువల సవరణకు ఆమోదం తెలిపింది. కొత్త మార్కెట్ విలువలు ఈ నెల 5వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్ల ధోరణి, డిమాండ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

రాష్ట్రంలోని 144 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూముల మార్కెట్ విలువలు పెరిగాయి. ఔటర్ రింగ్ రోడ్ రీజినల్ రింగ్ రోడ్ అభివృద్ధి కారిడార్లు వంటి ప్రాజెక్టుల ప్రభావాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఈ ప్రాంతాల్లో భూముల విలువలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో మార్కెట్ విలువలను సవరించింది.

ఫ్లాట్ల మార్కెట్ విలువల్లో ఉన్న అసమానతలను తొలగించేందుకు హేతుబద్ధీకరణ చేపట్టింది. కొన్ని ప్రాంతాల్లో అన్ని అంతస్తుల ఫ్లాట్లకు ఒకే మార్కెట్ విలువను అమలు చేయాలని నిర్ణయించింది. అలాగే ఎవీణూ, జఖ=జు, ఇతర ప్రాంతాలకు కనీస ప్రాథమిక మార్కెట్ రేట్లను నిర్ణయించింది.

వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఫ్లాట్లకు కొత్త కనీస మార్కెట్ విలువలను ఖరారు చేయడంతో పాటు నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ రేట్లను కూడా సవరించింది. ఆర్‌సీసీ, నాన్-ఆర్‌సీసీ నిర్మాణాలకు సంబంధించిన విలువల్లో మార్పులు చేసింది. భూ లావాదేవీల్లో పారదర్శకతను పెంచడం, మార్కెట్ ధరలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ విలువలను నిర్ణయించడం ఈ సవరణల ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.




## కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం

బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమాం ప్రమాణస్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో బుధవారం సాయంత్రం 4.05 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. డీకే శివకుమార్‌తో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతో పాటు మరో 13 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. సిద్ధరామయ్య ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉన్న జి.పరమేశ్వర కర్ణాటక ఉపముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు.

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు వీడీ సతీశన్, ఎ.రేవంత్ రెడ్డి, సుఖ్వీందర్ సింగ్ సుఖు, డీకే శివకుమార్ భార్య ఉషా శివకుమార్, కుమార్తె, పలువురు ఆధ్యాత్మిక నేతలు, విద్యార్థి, పౌరకార్మిక, రైతు ప్రతినిధులు, దళిత నేతలు, కన్నడ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మంత్రులుగా..

కాగా, డీకే శివకుమార్ క్యాబినెట్ మంత్రులు 13 మంది చేత గవర్నర్ గెహ్లాట్ తావర్‌చందర్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. వీరిలో కేజీ జార్జ్, జి.పరమేశ్వర, రామలింగా రెడ్డి, కృష్ణ బైరే గౌడ, యూటీ ఖాదెర్, ఎంబీ పాటిల్, సతీశ్ జార్కిహోళి, ప్రియాంక ఖర్గే, యతీంద్ర సిద్ధరామ్యయ, లక్ష్మీ హెబ్బాల్కర్ ఉన్నారు.




## 21 మంది మృతి

ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని ఓ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిప్రమాదం కారణంగా 21 మంది చనిపోగా.. 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. మల్వియా నగర్‌లోని, హౌజ్ రాణీ లైన్‌లో ఐదంతస్తుల భవనం ఉంది. భవనం బేస్‌మెంట్‌లో 'లెమన్ గ్రీన్ రెస్టారెంట్' ఉంది. బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది.

మంటల్లో చిక్కుకుని 21 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో హోటల్‌లో 40 మందికి పైగా జనం ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ఎక్కువ మంది మధ్య ఆసియా, ఆఫ్రికాకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరగడానికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది.

అగ్నిప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

హోటల్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఇస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉ ంటామని హామీ ఇచ్చారు.

## కాంగ్రెస్‌కు రాజ్యసభ సీటు కేటాయించిన విజయ్ టీవీకే

చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం తమ కీలక భాగస్వామ్య పార్టీ అయిన కాంగ్రెస్‌కు రాజ్యసభ స్థానం కేటాయించింది. తమిళనాడు నుంచి రాజ్యసభ స్థానానికి జూన్ 18న ఎన్నిక జరుగనుంది. కాంగ్రెస్‌కు రాజ్యసభ సీటును కేటాయించిన విషయాన్ని ముఖ్యమంత్రి విజయ్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

'ఈనెల 18న తమిళనాడులో రాజ్యసభకు ఎన్నిక జరుగనుంది. ఆ రాజ్యసభ సీటును మా భాగస్వామ్య పార్టీ అయిన కాంగ్రెస్‌కు కేటాయించాలని టీవీకే నిర్ణయం తీసుకుంది' అని విజయ్ పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మైలం నియోజకవర్గం నుంచి ఎన్నికైన రాష్ట్ర మాజీ మంత్రి సీవీ షణ్ముగం తన రాజ్యసభ స్థానానికి మే 7న రాజీనామా చేశారు. దీంతో ఆ స్థానానికి ఎన్నిక జరుగుతోంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జూన్ 8వ తేదీ వరకూ రిటర్నింగ్ అధికారి ముందు నామినేషన్లు దాఖలు చేసుకోవలసి ఉంటుంది. 9వ తేదీ ఉదయం 11 గంటలకు నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 11వ తేదీతో నామినేషన్ల



ఉపసంహరణ గడువు ముగుస్తుంది. ఒకరు కంటే ఎక్కువ మంది పోటీలో ఉంటే జూన్ 18వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 వరకూ సెక్రటేరియట్‌లో పోలింగ్ నిర్వహిస్తారు.

## ఆదాయానికి మించి ఆస్తుల కేసు.. భుజంగరావును అరెస్టు చేసిన ఏసీబీ

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ అదనపు ఎస్పీ భుజంగరావును ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఏసీబీ సోదాల్లో ఆయనకు సూర్యాపేటలో 27 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తించారు. ఐదు ఇంటి స్థలాలు, రెండు ఇళ్లు, హైదరాబాద్‌లో కమర్షియల్ భవనం, కిలో బంగారు నగలు, బ్యాంకు ఖాతాలో రూ.3.83 లక్షలున్నట్లు తేలింది. సోదాల్లో రూ.5.92 కోట్ల విలువైన సొత్తును గుర్తించారు. 29 మద్యం సీసాలు కూడా లభించడంతో ఏసీబీ అధికారులు ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇచ్చారు.

# విద్యార్థుల జీవితాలతో ఆటలా...

సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ 12వ తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో అనేక లోపాలు, తేడాలు బయటపడడం దేశవ్యాప్తంగా అలజడి సృష్టిస్తోంది. నీట్ ప్రశ్నపత్రాల లీక్ సంఘటన మరువక ముందే సిబిఎస్ఇ 12వ తరగతి ఫలితాలు వివాదాస్పద చర్చకు దారితీస్తున్నాయి. సిబిఎస్ఇ కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ వల్లనే ఈ గందరగోళం ఏర్పడింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకెండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) విద్యార్థుల పునఃమూల్యాంకన దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ క్రమంలో తమ పోర్టల్‌పై భారీ సైబర్ దాడికి ప్రయత్నాలు జరిగాయని సీబీఎస్ఈ ప్రకటించింది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో 16 వేల మంది రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొంది. ఈ సమయంలోనే కొందరు డినయల్-ఆఫ్-సర్వీస్ అనే విధానంతో పోర్టల్‌పై దాడికి ప్రయత్నించారని, దీని వల్ల 2 నిమిషాల్లోనే దాదాపు 15 లక్షల మంది లాగిన్ అవ్వడానికి ప్రయత్నించారని తెలిపింది. అనధికారికంగా పోర్టల్‌లోకి చొరబడేందుకు లక్షకుపైగా సైబర్‌దాడుల ప్రయత్నాలు జరిగినట్లు తమ భద్రత వ్యవస్థ గుర్తించిందని వివరించింది. అయితే, ఈ సైబర్ దాడులను సమర్థంగా అడ్డుకున్నామని, ప్రస్తుతం పోర్టల్ పనిచేస్తూనే ఉందని చెప్పింది. విద్యార్థుల రీవేల్యుయేషన్ దరఖాస్తులను ప్రాసెస్ జరుగుతోందని తెలిపింది. ఒకేసారి 8,000 మందికిపైగా స్టూడెంట్లు పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చిన వెల్లడించింది. టెక్నికల్ టీమ్‌లు ఈ ప్లాట్‌ఫామ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని.. ఏదైనా ఇబ్బంది తలెత్తితే వెంటనే స్పందిస్తున్నాయని పేర్కొంది. విద్యార్థులకు ఎటువంటి అంతరాయం లేకుండా సేవలను అందించేందుకు తమ బృందాలు కృషి చేస్తున్నాయని సీబీఎస్ఈ పేర్కొంది. ప్లస్‌టూ లో సీబీఎస్ఈ కొత్తగా తీసుకొచ్చిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానం కారణంగా తమ జవాబు పత్రాలు తారుమారయ్యాయంటూ కొందరు విద్యార్థులు ఆందోళనలు వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీనిపై తీవ్ర దుమారం రేగడంతో సీబీఎస్ఈ స్పందించింది. సమాధాన పత్రాల స్కానింగ్ కాపీలను విద్యార్థులకు అందిస్తామని, వాటిని పరిశీలించిన తర్వాత రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. పునఃమూల్యాంకనం కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకునే పోర్టల్‌పైనే తాజాగా సైబర్ దాడి జరిగినట్లు వెల్లడించింది. జాతీయ స్థాయి పరీక్షలైన క్యూట్‌యుజి వల్ల విద్యార్థులు వేర్వేరు విశ్వవిద్యాలయాలకు ప్రత్యేకంగా ఎంట్రన్స్ పరీక్షలు రాయవలసిన అవసరం లేకుండా ఒకే పరీక్ష ద్వారా దేశంలోని అత్యుత్తమ యూనివర్శిటీల్లో సీట్లు పొందగలుగుతారు. అయితే క్యూట్‌లో ఎదురవుతున్న సాంకేతిక లోపాలు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ, సిబిఎస్ఇల్లో పదేపదే జరుగుతూ విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చివేస్తున్నాయి. సిబిఎస్ఇ 12వ తరగతి పరీక్షల ఫలితాలను పరిశీలిస్తే ఉత్తీర్ణత శాతం గత ఏడాది 88.39 శాతం ఉండగా, ఈ ఏడాది 85.29 శాతానికి దిగజారింది. 90 శాతం కన్నా స్కోరు సాధించిన విద్యార్థుల సంఖ్య కూడా బాగా తగ్గింది. దీంతో చాలా మంది విద్యార్థులు తాము ఆశించిన విధంగా ఫలితాలు రాకపోవడంతో మూల్యాంకనం కోసం ఆశ్రయించారు. 4 లక్షలకు మించి విద్యార్థులు జవాబు పత్రాల స్కానింగ్ కాపీలు కావాలని అభ్యర్థించారంటే ఎంత మంది ఈ ఫలితాలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారో తెలుస్తోంది. ఫిబ్రవరి 17న ఈ 12వ తరగతి పరీక్షలు జరగ్గా, ఈ పరీక్షలకు కేవలం పదిరోజులకు ముందుగా ఆన్‌లైన్ స్క్రీన్ మార్కింగ్ అమలు గురించి ఉపాధ్యాయులకు తెలియజేయడం విడ్డూరం. ఈ కొత్త పద్ధతిపై ఉపాధ్యాయులకు ఎంతవరకు అవగాహన ఉంది? వారు స్కానింగ్ చేసిన జవాబు పత్రాలను డిజిటల్ ప్రక్రియలో దిద్దగలరా? స్కానింగ్ కాపీలు స్పష్టంగా ఉంటున్నాయా? ఇవేవీ పరిశీలించకుండానే హడావిడిగా అమలు చేయడం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కూడా ఇదో అగ్నిపరీక్షగా తయారై అనేక లోపాలు పుట్టుకొచ్చాయి. ఫిబ్రవరి 9న సిబిఎస్ఇ జారీ చేసిన సర్కులర్‌లో ఆన్‌లైన్ స్క్రీన్ మార్కింగ్ ప్రక్రియ వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని వివరించింది. విద్యా సంస్కరణల్లో నూతన అధ్యాయం తప్పులు పూర్తిగా తొలగించవచ్చని, మానవ సహాయం చాలావరకు తగ్గుతుందని, మూల్యాంకనం అంటే పేపర్లు దిద్దడం చాలా వేగంగా జరుగుతుందని, ఫలితాలు వెలువడిన తరువాత తిరిగి పరిశీలించవలసిన అవసరం రాదని ఇలా ఎన్నెన్నో పేర్కొంది. కానీ ఆచరణాత్మకం వాటికి భిన్నంగా ఫలితాలు కనిపించాయి. 17 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. అంటే వీరికి 98 లక్షల జవాబు పత్రాల పుస్తకాలు అందించారు. అంటే 40 కోట్ల పేజీలు ఇచ్చినట్టు. ఇవన్నీ మాన్యువల్‌గా రికార్డు సమయానికి స్కానింగ్ చేయవలసి ఉంటుంది. మూల్యాంకనం కోరిన వారికి ఇవన్నీ పరిశీలించవలసి ఉంటుంది. దీనికి తగిన కనీస మౌలిక అవసరాలు, కంప్యూటర్లు, లాకింగ్ సిస్టమ్ తదితర సాంకేతికత సరిగ్గా లేక గందరగోళం ఏర్పడి తప్పుల కుప్పలు కనిపిస్తున్నాయి. అంటే సిబిఎస్ఇ పరీక్షల నిర్వహణ ఎంత లోపభూయిష్టంగా ఉందో స్పష్టమవుతోంది. స్కానింగ్ వ్యవస్థ పూర్తిగా అందుబాటులోకి రాకుండా ఆన్‌స్క్రీన్ మార్కింగ్ ప్రక్రియను ఎందుకు సిబిఎస్ఇ ప్రవేశపెట్టిందో అర్థంకావడం లేదు. ఇది క్షమించరానిది. ఇది తాత్కాలిక సర్దుబాటుగా సిబిఎస్ఇ చెబుతున్నా సక్రమంగా అంతవరకు ఉన్న వ్యవస్థను నాశనం చేసినట్టే. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? ఈ లోపాలపై ఎవరు దర్యాప్తు చేస్తారు? లోక్‌సభ విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఈ ఆన్‌లైన్ స్క్రీన్ మార్కింగ్ వ్యవస్థ వల్ల మూల్యాంకనం తప్పులు, అక్రమాల పుట్టగా తయారైందని ధ్వజమెత్తారు. సిబిఎస్ఇ పొరపాటు వల్ల మార్కులు తప్పుగా వస్తే, దానికి మీకు బిల్లుపడుతుందన్నారు. డిజిటల్ స్కాన్ కాపీ తీసుకోవాలంటే ఒక సబ్జెక్టుకు రూ. 100, ఒక పేపర్ రీటోటలింగ్‌కు రూ. 100, రీ ఎవాల్యుయేషన్ చేయించుకోవాలంటే ఒక ప్రశ్నకు రూ. 25, మొత్తంగా ఒక విద్యార్థి తన జవాబు పత్రాన్ని సరిగ్గా దిద్దించుకోవడానికి దాదాపు రూ. 2000 చెల్లించవలసి రావచ్చన్నారు. మొత్తం 4 లక్షల మంది విద్యార్థులు మూల్యాంకనం కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు సిబిఎస్ఇ ఎంత సొమ్ము ఆర్జిస్తోందో గమనించాలని విద్యార్థులకు సూచించారు. ఇదంతా శిక్ష పడుతున్నది విద్యార్థులకు, ఆదాయం ప్రభుత్వానికి అని ఎద్దేవా చేశారు. ఇదిలా ఉండగా ఈ పరీక్షల నిర్వహణకు ఎడ్యుటెక్ అనే సంస్థను సిబిఎస్ఇ ఎంపిక చేయడాన్ని ఆక్షేపించారు. తెలంగాణలో గ్లోబరేనా అనే పేరుతో ఈ సంస్థ 2019, 2023లో స్కామ్‌కు పాల్పడిందని, అలాంటి రికార్డు ఉన్న సంగతి సిబిఎస్ఇకి తెలియదా? అని ప్రశ్నించారు. ఈ కంపెనీ రికార్డు తెలిసినా దీన్ని ఎంచుకోవడంలో ఏదో నిగూఢమైన కారణం ఉందని ఆరోపించారు. అయితే ప్రభుత్వ ప్రొక్యూర్‌మెట్ పాలసీ ప్రకారమే ఈ కంపెనీని ఎంపిక చేసినట్టు సిబిఎస్ఇ వెల్లడించింది. అయితే జవాబు పత్రాల మూల్యాంకన పోర్టల్‌లోని లోపాలను వినియోగదారులు బయటపెట్టడంతో సిబిఎస్ఇ వాటిని అంగీకరించడమే కాక, ఈ కంపెనీపై జరిమానా విధించడానికి సిద్ధమైనట్టు తెలుస్తోంది. విద్యార్థులు తమ బాల్యం లోని మంచి దశను, వారి ఆత్మస్థైర్యాన్ని నాశనం చేసే బోర్డు, ప్రవేశ పరీక్షల కోసం త్యాగం చేయవలసి వస్తోందని పరీక్షల నిర్వాహకులు తెలుసుకోవాలి. యువత తమ కెరీర్, ఉన్నత చదువుల కోసం రాసే ఈ ప్రవేశ పరీక్షల ఒత్తిడి, పోటీ కారణంగా వారు స్వేచ్ఛను కోల్పోయి, పరీక్షలకే పరిమితమవుతున్నారు. ఇది విద్యార్థి తరానికి జరిగిన ఒక బాధాకరమైన, నిరాశపరిచే నమ్మకద్రోహం.

# పంచాయితీల తర్వాతే మున్సిపాల్టీలు

విశాఖపట్టణం, జూన్ 3,

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. పంచాయితీతోపాటు మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే పంచాయతీల పాలకవర్గం ముగిసింది. కొత్తగా ప్రత్యేక అధికారులను కూడా నియమించారు. మున్సిపాలిటీలకు సైతం ఆర్డీవో స్థాయి అధికారులు ప్రత్యేక అధికారులుగా వచ్చారు. అయితే ముందుగా పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. రెండేళ్ల పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని కూటమి భావిస్తోంది. ఎన్నికల నిర్వహణకు ఇదే సమయం అని అంచనా వేస్తోంది. మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం స్థానిక ఎన్నికలకు సిద్ధపడుతోంది. ప్రతిచోట వైసీపీ అభ్యర్థి బరిలో ఉండాల్సిందేనని.. లేకుంటే మాత్రం వైసిపి ఇన్చార్జ్ పై వేటు వేస్తామని జగన్మోహన్ రెడ్డి హెచ్చరించారు. మరోవైపు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తమ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిస్తున్నారు. కూటమి ప్రభుత్వపరంగా ఈనెల కీలకం. ముఖ్యంగా ఇదే నెలలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మత్స్యకారుల భరోసా వంటి పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేయనుంది. దీంతో ప్రజల్లో సంతృప్తి శాతం పెరుగుతుందని అంచనా వేస్తోంది. మరోవైపు కొత్త పింఛన్లకు సంబంధించిన బిగ్ అప్డేట్ వచ్చింది. సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం నడుస్తోంది. కొత్త పింఛన్లు మంజూరు చేసి.. ప్రజల్లో మరింత సంతృప్తి సాధించి.. ఎన్నికలకు వెళ్లాలన్న ఆలోచనలో కూటమి ఉంది. అయితే జూలై నుంచి స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ముందుగా పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 13 వేలకు పైగా పంచాయతీలు ఉన్నాయి. వీటికి ఏప్రిల్ నాలుగు తో పదవీకాలం గడువు ముగిసింది. అప్పటినుంచి ప్రత్యేక అధికారులను నియమించారు. మరోవైపు ఏప్రిల్ నుంచి 16వ ఆర్థిక సంఘం గడువు ప్రారంభం అయింది. పంచాయితీలకు పాలకవర్గాలు ఉంటేనే ఆర్థిక సంఘం నిధులు దక్కేవి. అందుకే ముందుగా పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం సూత్రప్రాయంగా ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. వీలైనంతవరకు పంచాయితీలను ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నాలు చేసే అవకాశం కనిపిస్తోంది. కానీ ఎట్టి పరిస్థితుల్లో ఏకగ్రీవాలకు ఒప్పుకోవద్దు అని జగన్మోహన్ రెడ్డి గట్టిగానే చెప్పారు. అయితే క్యాడర్ మాత్రం విముఖత వ్యక్తం చేస్తోంది. స్థానిక ఎన్నికలు అంటేనే అధికార పార్టీకి అనుకూలంగా ఉంటాయి. పైగా ఆర్థిక భారం తప్పేలా లేదు. కానీ అధినేత జగన్మోహన్ రెడ్డి వైఖరి చూస్తుంటే తప్పనిసరిగా బరిలో ఉండాల్సిందేనని చెబుతున్నారు. కానీ పార్టీ శ్రేణులు మాత్రం పులివెందుల జడ్పిటిసి ఎన్నికలను గుర్తుచేసుకొని భయపడుతున్నారు.

మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా 110 కి పైగా మున్సిపాలిటీలు, 12 కార్పొరేషన్లు ఉన్నాయి. పట్టణాలతో పాటు నగరాల్లో కూటమికి సంతృప్తికర వాతావరణముంది. పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతుండడంతో అక్కడి ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అక్కడ కూడా కూటమి సత్తా చాటాలని చూస్తోంది. కానీ ఎట్టి పరిస్థితుల్లో ఏకగ్రీవాలు కాకుండా పోటీ చేయించాలన్న ఆలోచనలో వైసిపి ఉంది. కానీ వైసీపీ క్యాడర్ మాత్రం అందుకు సుముఖంగా లేదు. కానీ అధినేత జగన్మోహన్ రెడ్డి పట్టుబడుతుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోటీ చేయాల్సి ఉంటుంది.

పార్టీ కోసం కష్టపడిన వారికే టికెట్లు..!

ఇటు పార్టీ అగ్రనేతల కామెంట్స్..మరోవైపు ఎస్ఈసీ డెవలప్‌మెంట్స్‌తో..ఏపీలో స్థానిక ఎన్నికల సందడి ఊపందుకుంటోంది. ప్రధాన పార్టీలు క్షేత్రస్థాయి పర్యటనలకు సిద్ధమవుతున్నాయి. పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉండటంతో టీడీపీ ఈ ఎలక్షన్స్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు గెలుచుకున్న స్థానాలను తిరిగి కైవసం చేసుకుని పసుపు జెండా రెపరెపలాడించాలని పట్టుదలతో ఉంది. మహానాడు వేదికపైనా స్థానిక ఎన్నికలపై చర్చ జరిగింది. పార్టీ జెండా మోసిన వారికి పోటీ అవకాశం కల్పించాలని ఎమ్మెల్యేలకు ఆదేశాలు వెళ్లాయంటున్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి కచ్చితంగా టికెట్లు ఇస్తామని సీఎం చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని సంకేతాలిచ్చారాయన. ఇక ఇదే సందర్భంలో మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ కూడా స్థానిక ఎన్నికలపై గురిపెట్టారు. ఏకగ్రీవాలు కాకుండా చూడాలని, ప్రతి స్థానంలోనూ పోటీ ఉండేలా అభ్యర్థులను ఇప్పటినుంచే రెడీ చేయాలని లీడర్లకు సూచించారు. దీంతో ఒక్కసారిగా ఏపీలో పొలిటికల్ హీట్ కాక రేక రేపుతోంది. స్థానిక ఎన్నికల్లో టీడీపీ, వైసీపీల మధ్యే గట్టి పోటీ ఉండే పరిస్థితి కనిపిస్తోంది. కూటమిలో జనసేన, బీజేపీకి సీట్లు కేటాయించిన చోట..పరిస్థితులు తమకు అనుకూలంగా ఉంటాయని వైసీపీ భావిస్తోంది. 2021-22లో జరిగిన ఎన్నికల్లో అప్పటి అధికార పార్టీ వైసీపీ రాష్ట్ర వ్యాప్తంగా 80 శాతం స్థానాలను సొంతం చేసుకుంది. ప్రస్తుత ఎన్నికల్లో 100 శాతం స్థానాలను గెలుచుకోవాలని టీడీపీ యోచిస్తోంది. వైసీపీపై రాజకీయ ప్రతీకారం తీర్చుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న జనసేన కూడా కీలక స్థానాల్లో పోటీ చేసే యోచనలో ఉంది. ఆయా జిల్లాల నుంచి ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతలు కీలకమైన వార్డులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. మరోవైపు బీజేపీ కూడా తమకు బలం ఉన్నచోట అభ్యర్థులను పోటీలోకి దించేందుకు సిద్ధమవుతోంది. అయితే ఎన్నికలకు దూరంగా ఉండాలా..లేక పోటీ చేయాలా అనే డైలామాలో ఉన్న వైసీపీ ఇక అమీతుమీ తేల్చుకునేందుకు రెడీ అయినట్లు కనిపిస్తోంది. అధికార పక్షంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని భావిస్తున్న ఫ్యాన్ పార్టీ..స్థానిక ఎన్నికల్లో గెలుపు గుర్రాలను రంగంలోకి దించేందుకు సర్వం సిద్ధం చేస్తోందట. రాష్ట్రస్థాయి కీలక నేతల సమావేశంలో స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు జగన్. ముఖ్యంగా ఏకగ్రీవాలు కాకుండా చూడాలని, అలా జరిగితే నియోజకవర్గ ఇంచార్జ్‌ల ఫెయిల్యూర్‌గా భావించాల్సి వస్తుందని ముఖ్యనేతలను హెచ్చరించారు. దీంతో స్థానిక పోరు విషయంలో తగ్గేదేలే అన్న ఇండికేషన్ పంపించారు వైసీపీ అధినేత జగన్. ఉమ్మడి 13 జిల్లాల పరిధిలో దాదాపు 13 వేల 326 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో కొన్నింటికి న్యాయపరమైన చిక్కుల కారణంగా గతంలో ఎన్నికలు నిర్వహించ లేదు. ఇప్పుడు అన్ని పంచాయతీలకు ఎలక్షన్స్ జరిపే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే 660 జడ్పీటీసీ స్థానాలు, 10వేల 47కి పైగా ఎంపీటీసీ స్థానాలకు ఎలక్షన్స్ పెట్టనుండటంతో పల్లెల్లో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కుతోంది. అలాగే రాష్ట్రంలో 13 కార్పొరేషన్లలో వార్డుల పునర్విభజన ప్రకారం 920కు వార్డుల సంఖ్య పెరిగింది. 75 మున్సిపాలిటీల పరిధిలో దాదాపు 2 వేలకు పైగా వార్డులు ఉన్నాయి. వీటన్నింటికీ కూడా రెండు విడతల్లో స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు స్టేట్ ఈసీ కసరత్తు చేస్తోంది.

# టీడీపికి కలిసి రాని రాజ్యసభ

విజయవాడ, జూన్ 3,

తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ ఎన్నికల సందడి ఊపందుకుంది. రాష్ట్రంలో కూటమికి ఉన్న భారీ మెజారిటీ కారణంగా ఖాళీ అవుతున్న నాలుగు స్థానాలనూ కైవసం చేసుకోవడం నల్లేరుపై నడకే. అయితే, ఈ విజయోత్సాహం నడుమ పార్టీలో ఒక ఆసక్తికరమైన, పాత వివాదం మళ్ళీ తెరపైకి వచ్చింది. 1984 లో ఎన్టీఆర్ కాలం నుంచి నేటి వరకు పెద్దల సభకు వెళ్లిన నేతల చరిత్రను గమనిస్తే.. రాజ్యసభ సభ్యులు టీడీపీకి ఎప్పుడూ కలిసి రాలేదు అనే సెంటిమెంట్ క్యాడర్‌లో బలంగా వినిపిస్తోంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత ఇప్పటివరకు దాదాపు 46 మంది నేతలు ఆ పార్టీ తరఫున రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. అయితే ఈ సుదీర్ఘ చరిత్రలో ఒక చేదు నిజం పార్టీని నిరంతరం వెంటాడుతోంది. టీడీపీ తరఫున ఒకసారి కంటే ఎక్కువసార్లు రాజ్యసభకు వెళ్లిన నేతలలో అత్యధికులు కీలక సమయంలో పార్టీకి హ్యాండ్ ఇచ్చి వలస బాట పట్టారు. నాడు ఎన్టీఆర్ హయాంలో పార్టీలో అత్యంత కీలక చక్రం తిప్పిన పి. ఉపేంద్ర కాలం నుంచి.. నిన్నమొన్నటి సుజనా చౌదరి, సీఎం రమేష్ వరకు ఈ జాబితా చాలా పెద్దదిగానే ఉంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలవాల్సిన ఈ పెద్దలు .. సొంత ప్రయోజనాల కోసం లేదా కేసుల భయంతో పార్టీ లైన్ దాటడం ప్రతిసారీ క్యాడర్‌ను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. టీడీపీ చరిత్రలోనే అత్యంత ఘోరమైన పరాజయాన్ని మూటగట్టుకున్న 2019 ఎన్నికల తర్వాత ఈ రాజ్యసభ సభ్యుల వలసలు పరాకాష్టకు చేరాయి. అప్పట్లో టీడీపీకి ఉన్న ఆరుగురు రాజ్యసభ సభ్యుల్లో నలుగురు సుజనా చౌదరి, సి.ఎం. రమేష్, టి.జి. వెంకటేష్, గరికపాటి మోహన్ రావు ఒకేసారి గ్రూప్‌గా మారి, రాజ్యసభలో టీడీపీ పక్షాన్ని ఏకంగా బీజేపీలో విలీనం చేసేశారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం రెండు పైగా మూడు వంతుల మెజారిటీని వాడుకుని, అనర్హత వేటు పడకుండా వీరు సేఫ్‌గా కమలం గూటికి చేరిపోయారు. అంతకుముందు చంద్రబాబుకు అత్యంత నమ్మకస్తులుగా, ఢిల్లీలో పార్టీ ముఖచిత్రాలుగా వెలిగిన వీరే.. పార్టీ ఓడిపోగానే పక్కదారి పట్టడం చంద్రబాబు రాజకీయ వ్యూహాల లోపాన్ని ఎత్తిచూపింది. ఈ వరుస వలసల వెనుక ఉన్న అసలు కారణంపై టీడీపీ క్షేత్రస్థాయి క్యాడర్, సీనియర్ లీడర్లలో తీవ్రమైన అసంతృప్తి ఉంది. ఎలక్షన్ల సమయంలో పార్టీ గెలుపు కోసం రాత్రింబవళ్లు లాఠీ దెబ్బలు తింటూ, జైళ్లకు వెళ్లే గ్రౌండ్ లెవెల్ లీడర్లను పక్కన పెట్టి.. కేవలం ఫండింగ్ చేసేవారికి, తెర వెనుక చక్రం తిప్పే కార్పొరేట్ శక్తులకే చంద్రబాబు రాజ్యసభ సీట్లు ఇస్తారనే విమర్శ మొదటి నుండి ఉంది. ఢిల్లీలో లాబీలు నడపడానికి, వ్యాపార ప్రయోజనాలు కాపాడుకోవడానికి వచ్చే ఇలాంటి పారాచూట్ నేతలకు పార్టీ సిద్ధాంతాల పట్ల గానీ, కార్యకర్తల కష్టం పట్ల గానీ ఎలాంటి నిబద్ధత ఉండదు. అందుకే, అధికారం మారగానే వీరు తమ వ్యాపారాలను, కాంట్రాక్టులను కాపాడుకోవడానికి అధికార పార్టీలోకి జంప్ అయిపోతుంటారని క్యాడర్ గట్టిగా నమ్ముతోంది. ప్రస్తుతం జూన్ 2026 లో ఖాళీ అవుతున్న నాలుగు రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో మళ్లీ లాబీయింగ్ మొదలైంది. కూటమి ఒప్పందంలో భాగంగా జనసేనకు ఒక సీటు కేటాయించగా, మిగిలిన మూడు సీట్లు టీడీపీ దక్కించుకోనుంది. ప్రస్తుతం సిట్టింగ్ ఎంపీగా ఉన్న సానా సతీష్ బాబు తో పాటు పాత కార్పొరేట్ ముఖాలు మళ్లీ సీట్ల కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే, ఈసారి నారా లోకేష్ నేతృత్వంలో అభ్యర్థుల ఎంపిక జరుగుతుండటంతో.. యువతకు, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న బీసీ, ఎస్సీ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాలని, పాత తప్పులను పునరావృతం చేయవద్దని కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేస్తున్నారు. ఒక ప్రాంతీయ పార్టీ జాతీయ స్థాయిలో తన వాయిస్ బలంగా వినిపించాలంటే రాజ్యసభ సభ్యుల పాత్ర కీలకం. కానీ టీడీపీ విషయంలో ఈ సభ్యులు కేవలం పవర్ బ్రోకర్లు గా మిగిలిపోతున్నారనేది నిజం. సురేష్ ప్రభు లాంటి బయటి వ్యక్తులకు కూడా గతంలో టీడీపీ సీటు ఇచ్చింది. ఈ ధోరణి మారకపోతే, భవిష్యత్తులో కూడా ఈ సీట్లు పార్టీకి కేవలం తాత్కాలిక అవసరాలకే ఉపయోగపడతాయి తప్ప, నమ్మకమైన లీడర్‌షిప్‌ను తయారు చేయలేవు. చంద్రబాబు నాయుడు ఈ ఎన్నికల్లో కేవలం ఆర్థిక అంగబలాన్ని మాత్రమే చూడకుండా, రాజకీయ అంగబలం, నమ్మకమైన చరిత్ర ఉన్నవారికే పెద్దల సభకు పంపితేనే ఈ రాజ్యసభ శాపం నుంచి టీడీపీ బయటపడగలదని టీడీపీ క్యాడర్ అభిప్రాయం.

================

# కమలానికి ఏమైంది...

నెల్లూరు, జూన్ 3, (

ఏపీలో బిజెపి ప్రక్షాళన దిశగా హై కమాండ్ అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ పార్టీ నేతల వ్యవహార శైలిపై ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. పార్టీ అభివృద్ధిపై నేతలు పెద్దగా దృష్టి పెట్టడం లేదు. పైగా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు ఉన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. పార్టీని బలోపేతం చేయడం లేదు. దీనిపై హై కమాండ్ కు స్పష్టమైన సమాచారం ఉంది. అందుకే నేతల తీరుపై పెద్దలు ఆగ్రహంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఓ ముఖ్యమైన నేతను పిలిచి గట్టిగానే క్లాసు పీకినట్లు తెలుస్తోంది. సదరు నాయకుడి ఎదుట నేతల పనితీరు, వ్యవహార శైలి బయట పెట్టినట్లు సమాచారం. అందుకే మొత్తం మార్పు దిశగా అడుగులు వేస్తామని హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఏపీలో భారతీయ జనతా పార్టీ కనీసం సొంతంగా ఉనికి చాటుకునే పరిస్థితిలో లేదు. తెలుగుదేశం పార్టీతో కలిసిన సమయంలో మాత్రమే ఓట్లతో పాటు సీట్లు పెరుగుతున్నాయి. ఒంటరిగా పోరాటం చేస్తున్న ప్రతిసారి ఒక్క నియోజకవర్గంలో కూడా డిపాజిట్లు రావడం లేదు. 2014లో టిడిపి తో కలిసి పోటీ చేస్తే ఎమ్మెల్యే తో పాటు ఎంపీ స్థానాలను దక్కించుకుంది బిజెపి. మొన్నటి ఎన్నికల్లో పొత్తులో భాగంగా ఎనిమిది ఎమ్మెల్యేలతో పాటు రెండు పార్లమెంట్ స్థానాలు ఆ పార్టీకి దక్కాయి. అయితే ఇప్పుడు కూడా ఎంపీలతో పాటు ఎమ్మెల్యేలు ఎవరికి వారుగా వ్యవహరిస్తున్నారు. కనీసం పార్టీ కోసం పట్టించుకునే వారు కరువవుతున్నారుబిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితుడైన పివిఎన్ మాధవ్ పార్టీని అభివృద్ధి చేస్తారని హైకమాండ్ భావించింది. ఆయనపై చాలా రకాలుగా అంచనాలు పెట్టుకుంది. కానీ ఎందుకో ఆయన ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదు. ప్రారంభంలో హడావిడి చేశారు. తరువాత ప్రెస్ మీట్ లకే పరిమితం అవుతున్నారు. దీంతో పార్టీ శ్రేణులకు అందుబాటులో లేరన్న విమర్శలు ఉన్నాయి. పార్టీకి పెద్దదిక్కుగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అన్నారు. ఆయనకు ఢిల్లీలో పరపతి ఉంది. సీఎం చంద్రబాబు వద్ద గౌరవం ఉంది. అందుకే ఆయన కేంద్ర ప్రభుత్వపరంగా, రాష్ట్ర ప్రభుత్వపరంగా పనులు చేసుకుంటున్నారు. స్థానికంగా పార్టీ శ్రేణులకు అందుబాటులో లేరన్న విమర్శ ఉంది. దగ్గుబాటి పురందేశ్వరి పరిస్థితి కూడా అదే. మొన్నటి ఎన్నికల వరకు ఆమె బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలుగా ఉండేవారు. ఇప్పుడు రాజమండ్రి ఎంపీగా కూడా ఉన్నారు. కనీసం వారంలో ఒక్కరోజు కూడా ఆమె అందుబాటులో ఉండడం లేదు. ఆమె తరుపున కూడా ఎవరు లేకుండా పోయారు పార్లమెంట్ నియోజకవర్గంలో. ఇవన్నీ పార్టీ దృష్టికి వెళ్లాయి కూడా.. అందుకే హై కమాండ్ ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. మూడు పార్టీలు కలిసి వెళ్తాయి. కానీ క్షేత్రస్థాయిలో భారతీయ జనతా పార్టీకి బలం లేదు. ఆ బలం పెంచుకునే ప్రయత్నం కూడా జరగలేదు. జిల్లా కమిటీలు ఉన్నాయంటే ఉన్నాయి. కనీసం గ్రామస్థాయి కమిటీలు లేవు. మండల కమిటీలు కానరావు. నియోజకవర్గాలు ఇన్చార్జులు ఉన్న ఫలితం లేదు. వాస్తవానికి భారతీయ జనతా పార్టీ ఇతర రాష్ట్రాల్లో బూత్ లెవెల్ లో బలమైన కమిటీలు ఉంటాయి. కానీ ఏపీ విషయానికి వచ్చినప్పుడు అటువంటి పరిస్థితి లేదు. ఇలానే కొనసాగితే ఏపీ బీజేపీలో ప్రక్షాళనకు హైకమాండ్ ప్రయత్నించే అవకాశం ఉంది. కచ్చితంగా చాలా రకాల మార్పులకు ఆ పార్టీ పెద్దలు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# టార్గెట్ 100
# జగన నయా లెక్కలు

విజయవాడ, జూన్ 3,



రాజకీయాల్లో పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు మారడం సహజం. అయితే భారీ విజయాలను లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళ్లిన పార్టీలు అనూహ్య ఫలితాలు ఎదుర్కొన్నప్పుడు తమ కార్యాచరణను తిరిగి సమీక్షించుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కూడా ఇలాంటి చర్చలే జరుగుతున్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల సమయంలో వై నాట్ 175 అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేసిన పార్టీ, ఎన్నికల ఫలితాల్లో కేవలం 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితం కావడంతో భవిష్యత్ వ్యూహాలపై అంతర్గతంగా మంతనాలు ప్రారంభమైనట్లు సమాచారం.ఇటీవల నిర్వహించిన పార్టీ సమావేశాల్లో నాయకుల మధ్య కొత్త ఎన్నికల లక్ష్యాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. గతంలో అత్యంత భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం వల్ల క్షేత్రస్థాయిలో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని కొందరు అభిప్రాయపడ్డారు. అందువల్ల వచ్చే ఎన్నికల్లో వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పరిమిత లక్ష్యంతో ముందుకు సాగాలని సూచనలు వచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.కొంతమంది నాయకులు 175 స్థానాలపై దృష్టి కేంద్రీకరించడం కంటే, గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న సుమారు 100 నియోజకవర్గాలను గుర్తించి ప్రత్యేక వ్యూహంతో పని చేయాలని అభిప్రాయపడినట్లు సమాచారం. బలమైన స్థానాల్లో పార్టీ శక్తిని కేంద్రీకరించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని వారు వివరించినట్లు తెలుస్తోంది.అలాగే ఆయా నియోజకవర్గాల్లో స్థానిక నాయకత్వాన్ని మరింత చురుకుగా మార్చడం, కార్యకర్తలను సమన్వయం చేయడం, ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం వంటి అంశాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. గత ఎన్నికల అనుభవాల ఆధారంగా బలహీనతలను గుర్తించి వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం అవసరమని నాయకులు అభిప్రాయపడ్డారని చెబుతున్నారు. పార్టీ అధ్యక్షుడు జగన్ తుది నిర్ణయం తీసుకునే వరకు ఈ అంశంపై అధికారిక స్పష్టత వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపైనే ప్రధాన దృష్టి పెట్టాలని నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం.ఇక పార్టీ సీనియర్ నేత సజ్జల రామకృష్ణ రెడ్డి సమావేశంలో లక్ష్యాల సంఖ్యను తగ్గించుకోవడంపై కాకుండా గెలుపు అవకాశాలను పెంచే మార్గాలపై దృష్టి పెట్టాలని సూచించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎన్నికల్లో విజయం సాధించాలంటే ప్రజల మద్దతు, సమర్థవంతమైన ప్రచారం కీలకమని ఆయన అభిప్రాయపడ్డారని సమాచారం.మరోవైపు రానున్న కాలంలో నిర్వహించే ప్రజా కార్యక్రమాలు, ముఖ్యంగా పార్టీ అధినేత చేపట్టనున్న పాదయాత్ర తర్వాత రాజకీయ పరిస్థితులను అంచనా వేసి తుది వ్యూహాన్ని ఖరారు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అప్పటి వరకు అన్ని నియోజకవర్గాల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పార్టీ పెద్దలు సూచించినట్లు సమాచారం. ఎన్నికల లక్ష్యాల కంటే ప్రజల్లో మళ్లీ విశ్వాసాన్ని పెంపొందించుకోవడంపైనే ప్రస్తుతం పార్టీ ప్రధానంగా దృష్టి సారిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

# షర్మిళకు హ్యాండేనా..

కడప, జూన్ 3



వైఎస్ షర్మిలకు రాజ్యసభ స్థానం దక్కుతుందా? అదీ కర్ణాటక నుంచి. అది సాధ్యమయ్యే పనేనా? కర్ణాటక కాంగ్రెస్ స్థానిక నేతలు ఇందుకు అంగీకరిస్తారా? అన్నది ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలసి వచ్చిన వైఎస్ షర్మిల కొంత ఉత్సాహంతో కనిపించారు. అయితే సమావేశంలో ఏం జరిగిందో తెలియదు కానీ, వైఎస్ షర్మిలకు కర్ణాటక నుంచి రాజ్యసభ పదవి దక్కుతుందని మాత్రం జోరుగా ప్రచారం అయితే జరుగుతుంది. తెలంగాణ ఎన్నికల సందర్భంగా తన పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేయడంతో షర్మిలకు రెండు హామీలు లభించాయి. ఒకటి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ గా నియమించడం, రెండోది రాజ్యసభ పదవి ఇవ్వడం. ఈ రెండు హామీలను నెరవేరుస్తామని చెప్పింది.తెలంగాణ వ్యవసాయం

ఇందులో ఏపీసీసీ చీఫ్ గా షర్మిలను నియమించారు. ఒక హామీ నెరవేరింది. కానీ రెండేళ్ల నుంచి మరొక హామీ మాత్రం నెరవేరలేదు. ఆ హామీని త్వరలో కర్ణాటకకు ముఖ్యమంత్రి కాబోతున్న డీకే శివకుమార్ ఇవ్వడంతో ఇప్పుడు ఆయనకు రాజకీయంగా ఇబ్బందిగా మారే అవకాశముంది. ఏపీలో కాంగ్రెస్ కు ఒక్కస్థానం కూడా లేకపోవడంతో తెలంగాణ, కర్ణాటకల నుంచి మాత్రమే వైఎస్ షర్మిలకు రాజ్యసభ పదవి ఇవ్వాల్సి ఉంటుంది. తెలంగాణ నుంచి ఇస్తే మళ్లీ సెంటిమెంట్ రాసుకుంటుందని భావించి కర్ణాటక నుంచి ఇవ్వాలని నిర్ణయించారు కానీ కర్ణాటకలో స్థానిక నేతల నుంచి ఈ ప్రతిపాదనకు వ్యతిరేకత వ్యక్తమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.డీకే శివకుమార్ కు ఇది బిగ్ టాస్క్ అని చెప్పాలి. ముఖ్యమంత్రి అయిన వెంటనే రాజ్యసభ అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. వైఎస్ షర్మిలను ఎంపిక చేస్తే స్థానిక కాంగ్రెస్ నేతల నుంచి డీకేకు వ్యతిరేకత మామూలుగా ఉండదు. లోకల్స్ కు ఇవ్వకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి ఎలా ఇస్తారన్న ప్రశ్న తలెత్తుంది. పైగా జాతీయ స్థాయి నేత అయితే ఓకే. కానీ పొరుగు రాష్ట్రంలోనేతకు ఎలా రాజ్యసభ పదవి ఇస్తారన్న ప్రశ్న ఖచ్చితంగా ఎదురవుతుంది. ఢిల్లీలో హైకమాండ్ ఇచ్చిన గ్యారంటీ కావడంతో అమలు చేస్తారా? లేదా? అన్నది ఇప్పుడు కర్ణాటక కాంగ్రెస్ అగ్రనేతలకు పెద్ద సమస్యగా మారింది. వైఎస్ షర్మిలకు రాజ్యసభ సీటు ఇచ్చినందువల్ల ఉపయోగం లేదు. అదే మరో రెండేళ్లలో కర్ణాటక ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఈ వివాదం ఊపందుకుంటే పార్టీకి ఇబ్బందికరంగా మారుతుందన్న కామెంట్స్ మాత్రం కన్నడ మీడియాలో జోరుగా కనిపిస్తున్నాయి.

# మాకో అవకాశం ఇవ్వండి

విజయవాడ, జూన్ 3, (

తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ పదవులపై చాలా మంది ఆశలు పెట్టుకున్నారు. అందులో సీనియర్ నేతలు ఎక్కువ మంది ఈ పదవిని ఆశిస్తున్నారు. కానీ పదవులు తక్కువ.. ఆశావహులు ఎక్కువగా ఉన్నారు. ఇది టీడీపీ నాయకత్వానికి కొంత ఇబ్బందిగా మారే అవకాశముంది. తాము పార్టీ కోసం పడిన కష్టాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ ను కలిసి తమ వినతులను సమర్పించారు. తమకు పెద్దల సభలో అవకాశం కల్పించాలని కోరుతున్నారు. కానీ నాయకత్వం మాత్రం రాజ్యసభ స్థానాల విషయంలో ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి వచ్చింది.వర్ల రామయ్య, యనమల రామకృష్టుడు, కంభంపాటి రామ్మోహన్ రావు వంటి నేతలు తమకు రాజ్యసభ పదవి ఇవ్వాలని కోరుతున్నారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కూడా కీలక కామెంట్స్ చేశారు. తన తర్వాత తన కుటుంబానికి కూడా రాజకీయంగా సేవ చేసే అవకాశం ఇవ్వాలని అయ్యన్న పాత్రుడు కోరారు. ఇరవై ఐదేళ్ల వయస్సు నుంచి టీడీపీలో సేవలందిస్తున్నానన్న ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు తన కుటుంబానికి కూడా అవకాశం కల్పించాలని కోరారు. అంటే పరోక్షంగా తన కుమారుడు చింతకాయల విజయ్ ను రాజ్యసభకు పంపాలని కోరినట్లు నాయకత్వానికి చెప్పకనే చెప్పినట్లయింది.తెలుగుదేశం పార్టీ కోసం జీవితాంతం పనిచేశానని అయ్యన్న పాత్రుడు భావోద్వేగంగా మాట్లాడారు. తన కుటుంబ సభ్యులకు కూడా పార్టీకి సేవ చేసే అవకాశం కల్పించాలని కోరిన స్పీకర్ అయ్యన్న అందుకు అవకాశమివ్వాలని పార్టీ నాయకత్వాన్ని కోరారు. త్వరలో రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులను ఎంపిక చేస్తున్న సమయంలో అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలకు రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. టీడీపీలో రాజ్యసభ ఆశావహుల మధ్య అయ్యన్న పాత్రుడి వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. మరి రాజ్యసభకు టీడీపీ నాయకత్వం ఎవరిని ఎంపిక చేస్తుందన్నది మాత్రం చివరి వరకూ సస్పెన్స్ గా కొనసాగే అవకాశముంది.

# కాంట్రవర్సీకి కేరాఫ్‌గా ఎమ్మెల్యే థామస్
## ఎస్సీ ఎమ్మెల్యేలకు గౌరవం లభించట్లేదని కామెంట్స్

తిరుపతి జూన్ 3, (న్యూస్ పల్స్)



చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ రూటే సపరేటు. డాక్టర్ వృత్తిలో ఎప్పుడు బిజీగా ఉండే ఆయన అప్పుడప్పుడు హాట్ కామెంట్స్ చేసి న్యూస్ హెడ్‌లైన్‌గా మారుతున్నారు. ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గ ఎమ్మెల్యేలకు తగిన గౌరవం లభించడం లేదంటూ గతంలో ఆయన చేసిన కామెంట్స్ దుమారం లేపాయి. ఇదే విషయంపై పలుమార్లు తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా వ్యక్తం చేశారు కూడా. లేటెస్ట్‌గా మరోసారి షాకింగ్ కామెంట్స్ చేశారు ఎమ్మెల్యే థామస్.మీడియా సమావేశం సాక్షిగా వివాదాస్పద వ్యాఖ్యలు చేసి..సొంత ఎమ్మెల్యేలు, పార్టీ అధిష్టానం ఆగ్రహానికి గురయ్యారు. ఎస్సీ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో మట్టి అక్రమ రవాణతో సహా ఏ చిన్న ఘటన జరిగినా మీడియాలో హైలెట్ చేస్తారని..అదే అగ్రవర్ణ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఏం జరిగినా వాటిపై మీడియాలో కథనాలు రావడం లేదంటూ థామస్ చేసిన వ్యాఖ్యలు సెన్సేషన్‌గా మారాయి. అంతటితో ఆగకుండా ఆయన..పక్కనే ఉన్న చంద్రగిరి, నగరి నియోజకవర్గాల నుంచి మట్టి అక్రమంగా బయటకు వెళ్లడం లేదా? వాటిని ఎందుకు ఎవరూ పట్టించుకోవడం లేదంటూ..మరింత వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.ఈ మాటలు వైరల్ అయ్యాయి. ఆయన వ్యాఖ్యలు స్వతహాగానే చంద్రగిరి, నగరి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, గాలి భానుప్రకాశ్‌లకు ఆగ్రహం తెప్పించినా..సొంత పార్టీ సహచర ఎమ్మెల్యే కావడంతో కౌంటర్ ఇవ్వకుండా మిన్నకుండిపోయారు. చివరకు థామస్ కామెంట్స్ పార్టీ అధిష్టానం చెవిన పడటంతో పార్టీ పెద్దలు సీరియస్ అయినట్లు తెలుస్తోంది. టీడీపీ స్టేట్ చీఫ్ పల్లా శ్రీనివాస్, థామస్‌ను సంజాయిషీ అడిగినట్లు తెలుస్తోంది. దీంతో పల్లా శ్రీనివాస్ ను కలిసి తాను చేసిన వ్యాఖ్యలపై థామస్ వివరణ ఇచ్చారు. తన మాటలను వక్రీకరించారని, ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు చేయబోనని చెప్పినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ విప్‌గాను కొనసాగుతున్న ఎమ్మెల్యే థామస్‌ను పార్టీ గట్టిగానే మందలించినట్లు చర్చించుకుంటున్నారు.జిల్లాకు చెందిన కొందరు టీడీపీ ఎమ్మెల్యేలు మాత్రం థామస్ తీరుపై కొంతకాలంగా గుర్రుగానే ఉన్నారట. ఎస్సీ ఎమ్మెల్యేలు, అగ్రవర్ణ ఎమ్మెల్యేలు అంటూ జిల్లాలో ఎమ్మెల్యేలను విడదీసే ప్రయత్నం చేస్తున్నారంటూ మండిపడుతున్నారట. తనపై ఆరోపణలు వస్తే వాటిని ఖండించాల్సింది పోయి..పక్క నియోజకవర్గ ఎమ్మెల్యేలకు బురద అంటించడం ఏంటని జిల్లా ఎమ్మెల్యేలు రగిలిపోతున్నారట. గతంలోనూ ఆయన ఇదే తరహాలో వ్యాఖ్యలు చేశారని కూడా కొందరు ఎమ్మెల్యేలు గుర్తు చేస్తున్నారు. మరోసారి థామస్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఆయనకు గట్టిగానే కౌంటర్ ఇవ్వాలని ఒకరిద్దరు జిల్లా ఎమ్మెల్యేలు డిసైడ్ అయినట్లు టాక్.

# బంగారం విక్రయిస్తున్న భారత్

ముంబై, జూన్ 3,



పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల మన ఇంధన దిగుమతుల బిల్లు భారీగా పెరిగింది. అలాగే ఈ ఏడాది 2026 జనవరి నుంచి ఇప్పటి వరకు స్టాక్ మార్కెట్లలో రూ.2.25 లక్షల కోట్ల విలువైన ఈక్విటీలను విదేశీ మదుపరులు విక్రయించారు. తమ పెట్టుబడులను తీసుకెళ్లారు. ఈ కారణాలతో అమెరికా డాలర్‌కు గిరాకీ బాగా పెరిగింది. రూపాయి విలువ పడిపోతోంది. దీంతో మన దగ్గర ఉన్న విదేశీ మారకపు నిల్వల విలువ భారీగా పడిపోతోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఫారెక్స్ నిల్వలు రూ.728.49 బిలియన్ డాలర్లుగా ఉండగా అది 4 నెలల్లోనే 47 బిలియన్ డాలర్లు తగ్గిపోయి 681.40 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. వీటిని కాపాడుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 6 బిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.57 వేల కోట్లు విలువైన పసిడి నిల్వలను విక్రయించినట్లు ప్రముఖ వార్తా సంస్థ బ్లూమ్ బర్గ్ తెలిపింది.ఫారెక్స్ నిల్వలు వృథాగా పోకుండా చూసేందుకు బంగారం దిగుమతిపై కస్టమ్స్ సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం రెట్టింపు కంటే పెంచి 15 శాతానికి చేసింది. ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉన్నా, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ఆర్థిక స్థితి దెబ్బతినకుండా చూసేందుకు పెట్రోల్, డీజిల్ ధరలనూ పెంచింది. అలాగే రిజర్వ్ బ్యాంక్ తన వద్ద ఉన్న నిల్వల్లో రూ.57 వేల కోట్ల పసిడిని మే 22తో ముగిసిన రెండు వారాల వ్యవధిలో విక్రయించింది. తద్వారా విదేశీ కరెన్సీ ఆస్తులకు ఈ మొత్తాన్ని జమ చేసుకుంది. మన ఫారెక్స్ నిల్వల్లో విదేశీ కరెన్సీ ఆస్తులు 543.032 బిలియన్ డాలర్లు కాగా పిసిడి నిల్వలు 114.786 బిలియన్ డాలర్ల మేర ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ లెక్కల ప్రకారమే 2 వారాల్లో పసిడి నిల్వల విలువ 6 బిలియన్ డాలర్లకు పైగా తగ్గింది.దేశ ఎగుమతుల కంటే దిగుమతులు బిల్లు భారీగా పెరుగుతోంది. దీంతో కరెంటు ఖాతా లోటు అంతకంతకూ అధికమవుతోంది. రూపాయి విలువ ఈ సంవత్సరంలో 7 శాతం వరకు పతనం అయ్యేందుకు కారణమైంది. అందుకే మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా ఉన్న సమయంలో డాలర్ నిల్వలను పెంచుకుని, రూపాయిని బలోపేతం చేయడంపై రిజర్వ్ బ్యాంక్ దృష్టి పెట్టింది. అందుకే బంగారం విక్రయిస్తోంది. ఈ ఏడాది మార్చి నెలలో ఆర్బీఐ వద్ద 880.52 టన్నుల బంగారం నిల్వలు ఉన్నాయి. వీటిలో 77 శాతం నిల్వలు భారత్‌లోనే ఉన్నాయి. అంతకు 6 నెలల క్రితం మన దేశంలో ఉన్న బంగారం నిల్వలు 66 శాతంగా ఉండడం గమనార్హం. మిగిలిన బంగారం బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్మెంట్స్ దగ్గర ఉండేది.

================

# వెండి పై మరిన్ని ఆంక్షలు

ముంబై, జూన్ 3,

పెరుగుతున్న దిగుమతులను అరికట్టడానికి, రూపాయిపై ఒత్తిడిని తగ్గించడానికి కేంద్రం వెండి దిగుమతులపై ఆంక్షలను కఠినతరం చేసింది. ఇందులో భాగంగా వెండిని గ్రెయిన్, పొడి రూపాల్లో ఉన్న వెండి దిగుమతిని నిషేధిత జాబితాలోకి చేర్చింది. పొడి, గ్రెయిన్ రూపాల్లో భద్రపరిచే కేటగిరీ కిందకు తీసుకురావడంతో పాటు, దిగుమతిదారులు ముందస్తు ప్రభుత్వ అనుమతి పొందాలని కూడా ఆదేశించింది. వెండి దిగుమతులకు తప్పనిసరిగా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ అనుమతి ఉండాలని కేంద్రం తెలిపింది. 99.9 శాతం స్వచ్ఛత గల వెండి ఉన్న గ్రెయిన్, పొడి, ఇతర రూపాల్లోని వండి వస్తువుల దిగుమతిని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.గత నెలలోనే 99.99 శాతం ప్యూరిటీ గల వండి కడ్డీల దిగుమతులను, పాక్షికంగా తయారైన అన్ని రకాల వెండి వస్తువులను నిషేధిత జాబితాలో కేంద్రం చేర్చిన సంగతి తెలిసిందే. అదే సమయంలో పెరుగుతున్న క్రూడ్ ఆయిల్ ధరల కారణంగా విదేశీ మారకపు నిల్వపపై ఒత్తిడిని తగ్గించేందుకు వెండి, బంగారం దిగుమతుల సుంకాన్ని భారీగా పెంచింది. 6 శాతంగా ఉన్న కస్టమ్స్ డ్యూటీని రెండింతలకు పైగా పెంచి 15 శాతానికి చేర్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు దేశంలోకి వెండి దిగుమతులు భారీగా పెరుగుతున్న క్రమంలో మరిన్ని ఆంక్షలు విధించింది.వెండి దిగుమతులు భారీగా పెరిగిన నేపథ్యంలో తాజా ఆంక్షలు విధించింది కేంద్రం. ప్రపంచంలోనే వెండిని అత్యధికంగా వినియోగించే దేశంగా భారత్ ఉంది. మార్చి 2026తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో వెండి దిగుమతులపై రికార్డు స్థాయిలో 12 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. అంతకు ముందు ఏడాది ఈ మొత్తం 4.8 బిలియన్ డాలర్లుగా ఉంది.



వాణిజ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం ఏప్రిల్‌లో వెండి దిగుమతులు గతేడాదితో పోలిస్తే 157 శాతం మేర పెరిగి 411 మిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.పెరిగిన చమురు ధరల నేపథ్యంలో విదేశీ మారక నిల్వలపై ఒత్తిడిని అరికట్టే విస్తృత ప్రయత్నాల్లో భాగంగా విలువైన లోహాల దిగుమతులను నిరుత్సాహపరిచేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. గత నెలలో బంగారం, వెండిపై దిగుమతి సుంకాలను 6 శాతం నుంచి 15 శాతానికి పెంచింది. అయితే కొత్త నిబంధనలు దిగుమతిదారులకు అనిశ్చితిని సృష్టించవచ్చని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. దేశంలో వెండిని ఆభరణాలు, నాణేలు, కడ్డీలు, అలాగే సౌరశక్తి, ఎలక్ట్రానిక్స్ వంటి పారిశ్రామిక అవసరాల కోసం విస్తృతంగా ఉపయోగిస్తారు. బలమైన పెట్టుబడిదారుల ఆసక్తి కూడా దీనికి తోడైంది. గత సంవత్సరంలో సిల్వర్ ఎక్ఛేంజ్-ట్రేడెడ్ ఫండ్స్‌కి నిధుల ప్రవాహం రికార్డు స్థాయికి చేరుకుంది.

భారతశక్తి



## వేలూరు రహదారిపై గాయాలతో వ్యక్తి మృతదేహం లభ్యం

చిలకలూరిపేట జూన్ 3

చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామంలో వేలూరు గ్రామం నుండి జాలాది వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఒక వ్యక్తి మృతదేహం పడి ఉండటాన్ని స్థానిక గ్రామస్తులు గమనించారు. రోడ్డుపై మృతదేహం ఉండటంతో భయాందోళనకు గురైన స్థానికులు, వెంటనే చిలకలూరిపేట రూరల్ పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. మృతుడి శరీరంపై పలుచోట్ల తీవ్ర గాయాలు ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. దీంతో ఈ ఘటనను అనుమానాస్పద మృతిగా (హత్య జరిగి ఉండవచ్చనే కోణంలో) పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అనంతరం కేసు నమోదు చేసుకున్న పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఎవరు? అసలు అక్కడ ఏం జరిగింది? అనే పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

## మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు కోసం కొనసాగుతోన్న గాలింపు

పల్నాడు జూన్ 3

వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. బ్రహ్మనాయుడు కోసం నర్సరావుపేటకు హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు వచ్చారు. బ్రహ్మనాయుడు నివాసంలో తనిఖీలు చేసారు. గండిపేటలో దాదాపు రూ.1500 కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూమి కబ్జా వ్యవహారంలో బొల్లా బ్రహ్మనాయుడుపై కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ..

## ఘోర ప్రమాదం.. రెండు బస్సులు ఢీకొని ఏడుగురు మృతి

సూరత్: జూన్ 3

గుజరాత్లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సూరత్ జిల్లా బర్డోలి ప్రాంతంలో రెండు బస్సులు ఢీకొన్నాయి.

ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందగా.. 10 మందికిపైగా గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. మంగళవారం రాత్రి మహారాష్ట్రకు చెందిన బస్సు.. బర్డోలి వద్ద ట్యాంకర్ను తప్పించబోయి అదుపుతప్పి డివైడర్ను దాటి ఎదురుగా వస్తున్న మరో బస్సును ఢీకొట్టింది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.

## రోడ్డు ప్రమాదంలో డ్యాన్స్ మాస్టర్ పండుకు గాయాలు

విశాఖపట్నం జూన్ 3

లొడగలవానిపాలెం హైవేపై అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న రెండు వాహనాలను బొలెరో వ్యాన్ ఢీకొట్టింది. ఘటనలో డాన్స్ మాస్టర్ పండుకు రెండు కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. మరో ముగ్గురికి స్వల్ప గాయాలు కావడంతో అందరిని . ఆసుపత్రికి తరలించారు. నిద్రమత్తు, అతివేగమే ప్రమాదానికి కారణమని అనుమానం. పచ్చి కోళ్ల లోడ్తో వెళ్తున్న బొలెరో అదుపుతప్పి ప్రమాదం జరిగింది. పండు బృందం తగరపువలస ఉత్సవాల నుంచి తిరుగు ప్రయాణంలో ఘటన జరిగింది. పోలీసులు ప్రమాదానికి గురైన మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

## దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జి పైనుండి దూకి యువతి ఆత్మహత్య

హైదరాబాద్ జూన్ 3

దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి పైనుంచి దూకి యువతి ఆత్మహత్య చేసుకుంది. తమ కూతురు రోజా రమణి(26) కనిపించడంలేదని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. నాగోల్ ప్రాంతంలో నివసిస్తూ మృతురాలు మెడికవర్ ఆసుపత్రిలో అకౌంటెంట్గా పని చేస్తుంది. లోన్ రికవరీ ఏజెంట్స్ వేదింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల అనుమానం.

## సెంటిమెంటే...ఆయింట్ మెంట్

# ఆత్మగౌరవ నినాదంతో అడుగులు

హైదరాబాద్, జూన్ 3,

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రాంతీయ సెంటిమెంట్ తెరపైకి వస్తోంది. పదేళ్ల రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇప్పుడిప్పుడే పరిపాలన, అభివృద్ధి అంశాలపై చర్చ జరుగుతుందనుకుంటున్న తరుణంలో, మళ్ళీ ఆంధ్ర-తెలంగాణ భావోద్వేగాలను రగిల్చే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. తెలంగాణలో ప్రస్తుతం సాగుతున్న సెంటిమెంట్ రాజకీయాల వెనుక ప్రధానంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగాలు క్రియాశీలకంగా కనిపిస్తున్నాయి. గతంలో కృష్ణా, గోదావరి నదీ జలాల వివాదాలను తెరపైకి తెచ్చి ప్రజల్లో సెంటిమెంట్ను రగిల్చేందుకు ప్రయత్నించినా ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. అయితే, ఇప్పుడు ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ టార్గెట్ గా జరుగుతున్న రాజకీయం, పవన్ కూడా తెలంగాణపై దృష్టి సారించడం, మంగళవారం జరిగిన సమావేశం పరిణామాలను ఆయుధంగా చేసుకుని తెలంగాణ ఆత్మగౌరవం పేరుతో కొత్త ఉద్యమాన్ని లేవనెత్తాలని బీఆర్ఎస్ భావిస్తోంది. తద్వారా కోల్పోయిన రాజకీయ ఉనికిని మళ్ళీ చాటుకోవాలన్నది ఆ పార్టీ వ్యూహం.కాంగ్రెస్ పార్టీలో కూడా ఈ సెంటిమెంట్ వేడి కనిపిస్తోంది. అనిరుధ్ రెడ్డి, మందుల సామ్యూల్ వంటి నేతలు ఏపీ నేతలను టార్గెట్ చేస్తూ చేస్తున్న వ్యాఖ్యలు పార్టీ లైన్కు భిన్నంగా ఉన్నట్లు కనిపిస్తోంది. వీరు కూడా ప్రాంతీయ నినాదంతోనే ప్రజల్లోకి వెళ్లాలని చూస్తున్నారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ఈ విషయంలో అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ప్రాంతీయ సెంటిమెంట్ మళ్ళీ బలపడితే, ఆ సెంటిమెంట్కు పేటెంట్ హక్కు కలిగిన బీఆర్ఎస్కే అంతిమంగా లాభం చేకూరుతుందని రేవంత్ గట్టిగా నమ్ముతున్నారు. అందుకే ఆయన భావోద్వేగాల కంటే బాధ్యతాయుతమైన పరిపాలనకే మొగ్గు చూపుతున్నారు.రేవంత్ రెడ్డికి ఒక స్పష్టమైన అవగాహన ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ను కాదని కాంగ్రెస్ను ఎన్నుకున్నది కేవలం సెంటిమెంట్ కోసం కాదు, మార్పు , పరిపాలన కోసం. ఇప్పుడు మళ్ళీ అదే సెంటిమెంట్ ఉచ్చులో పడితే, కాంగ్రెస్ తన అభివృద్ధి అజెండాను పక్కన పెట్టాల్సి వస్తుంది. పైగా, ఏపీతో సఖ్యతగా ఉంటూనే రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవాలని ఆయన భావిస్తున్నారు. కానీ, తన సొంత పార్టీ నేతలు కొందరు కంట్రోల్ కాకుండా ఏపీపై విమర్శలు చేయడం ఆయనకు తలనొప్పిగా మారింది. రేవంత్ రెడ్డి ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి డ్యూయల్ స్ట్రాటజీ అమలు చేసే అవకాశం ఉంది. ఒకటి, పార్టీ నేతలకు కఠినమైన ఆదేశాలు జారీ చేయడం ద్వారా ఏపీ నేతలపై అనవసర వ్యాఖ్యలు చేయకుండా అడ్డుకోవడం. రెండు, బీఆర్ఎస్ చేస్తున్న సెంటిమెంట్ ప్రచారాన్ని రాజకీయ డైవర్షన్ గా ప్రజల్లోకి తీసుకెళ్లడం. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేయని పనులను ఇప్పుడు సెంటిమెంట్ పేరుతో కప్పిపుచ్చుకోవాలని చూస్తోందని ఆయన వాదించనున్నారు.పవన్ కళ్యాణ్ ఫ్యాక్టర్ కూడా ఈ సమీకరణాల్లో కీలకం. పవన్ను టార్గెట్ చేయడం ద్వారా సెంటిమెంట్ను పెంచాలని బీఆర్ఎస్ చూస్తుంటే, రేవంత్ మాత్రం దాన్ని కేవలం ఒక పొరుగు రాష్ట్ర నేత పర్యటనగా మాత్రమే పరిగణించాలనే ధోరణిలో ఉన్నారు. తెలంగాణలో సెంటిమెంట్ రాజకీయాలు అనేవి ఒక డబుల్ ఎడ్జ్ స్వోర్డ్ లాంటివి. రేవంత్ రెడ్డి ఈ సెంటిమెంట్ వేవ్ ను సమర్థవంతంగా అడ్డుకోగలిగితేనే కాంగ్రెస్ ప్రభుత్వం సుస్థిరంగా ఉంటుంది. ఒకవేళ తన పార్టీ నేతలను కంట్రోల్ చేయడంలో విఫలమైతే, అది బీఆర్ఎస్కు ఆక్సిజన్ అందించినట్లు అవుతుంది.

# పెట్రోల్, గ్యాస్ కష్టాలు తీరినట్టే...

## అమల్లోకి వచ్చిన సీఈపీఏ

న్యూఢిల్లీ, జూన్ 3

అమెరికా?ఇరాన్ యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, హార్ముజ్ జలసంధి మూసివేత కారణంగా భారత్ ఇంధన రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలు భారీగా పెరిగి, సరఫరా కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వానికి ఊరట లభించింది.హార్ముజ్ జలసంధి ద్వారా ప్రపంచంలోని అత్యధిక చమురు, గ్యాస్ రవాణా జరుగుతుంది. ప్రస్తుత యుద్ధ పరిస్థితుల వల్ల నౌకల రవాణాలో అంతరాయం ఏర్పడటంతో భారత్కు ఇంధన సరఫరా దెబ్బతిన్నది. దీని ప్రభావంతో పెట్రోల్, ఎల్పీజీ ధరలు పెరిగాయి. సరఫరా కొరత ఏర్పడింది. పానిక్ బయింగ్ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో భారత్కు ప్రత్యామ్నాయ మార్గం అవసరమైంది.భారత్?ఒమన్ మధ్య కుదిరిన కాంప్రెహెన్సివ్ ఎకనామిక్ పార్టనర్షిప్ అగ్రిమెంట్ (సీఈపీఏ) 2025, జూన్ నుంచి అమలులోకి వచ్చింది. ఈ ఒప్పందం ద్వారా ఒమన్లోని ప్రధాన పోర్టులు (సలాలా, దుక్మ్ వంటివి) ద్వారా భారత్కు చమురు, ఎల్ఎన్జీ, ఇతర ఇంధన ఉత్పత్తులు ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా అవుతాయి. ఒమన్ తీర ప్రాంతం హార్ముజ్ జలసంధికి వెలుపల ఉండటం ఈ ఒప్పందాన్ని వ్యూహాత్మకంగా చాలా ముఖ్యమైనదిగా మార్చింది. ఇది భారత్కు సురక్షితమైన, నమ్మదగిన ఇంధన సరఫరా మార్గాన్ని అందిస్తోందిఒమన్తో ఒప్పందం కారణంగా హార్ముజ్పై అత్యధిక ఆధారపడటం తగ్గుతుంది. పెట్రోల్, ఎల్పీజీ, డీజిల్ సరఫరా స్థిరంగా ఉంటుంది. ధరల పెరుగుదల నియంత్రణలో ఉంటుంది. ప్రజల ఆందోళన తగ్గి, సాధారణ సరఫరా పరిస్థితి ఏర్పడుతుంది.ఈ ఒప్పందం కేవలం తాత్కాలిక పరిష్కారం కాదు. దీర్ఘకాలికంగా భారత్ ఇంధన దిగుమతులను వైవిధ్యపరచడంలో, సప్లై చైన్ను బలోపేతం చేయడంలో మైలురాయిగా నిలుస్తుంది.ప్రస్తుత భూరాజకీయ పరిస్థితులు ఏ సమయంలోనైనా హార్ముజ్ జలసంధిని ప్రభావితం చేసే అవకాశం ఉంది. అలాంటి



సమయంలో ఒమన్ లాంటి స్నేహపూర్వక దేశంతో బలమైన వాణిజ్య ? ఇంధన భాగస్వామ్యం ఏర్పాటు చేసుకోవడం భారత్ దూరదృష్టి, వ్యూహాత్మక విజ్ఞతను చూపిస్తోంది. ఇది భారత్ ఇంధన భద్రతలో కొత్త అధ్యాయం.

# గ్రామాల్లో ఇంటర్ నెట్ స్పీడ్ కోసం

## నయా కార్పొరేషన్

హైదరాబాద్, జూన్ 3, (

తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తెలంగాణ రూరల్ ఇంటర్నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ ను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ అమెండెడ్ భారత్ నెట్ పథకం కింద కేంద్ర, రాష్ట్రాల సమాన భాగస్వామ్యంతో ఇది పనిచేస్తుంది. సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి మేరకు కేంద్రం కార్పొరేషన్ నిర్వహణ కోసం పదేళ్లకు రూ.2600 కోట్లు అలాగే తొలి విడతగా 3 లక్షల గ్రామీణ కనెక్షన్ల కోసం రూ.300 కోట్లు మంజూరు చేసింది.తెలంగాణలోని పల్లెపల్లెకూ హైస్పీడ్ డిజిటల్ నెట్‌వర్క్‌ను అనుసంధానం చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విప్లవానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అమెండెడ్ భారత్ నెట్ పథకంలో భాగంగా.. తెలంగాణ రూరల్ ఇంటర్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఠీఎఎఅఒ)ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర టెలికమ్యూనికేషన్ల శాఖ నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమాన భాగస్వామ్యంతో ఈ నూతన సంస్థ పనిచేయనుంది.ఈ కొత్త కార్పొరేషన్ బోర్డులో ఇరుపక్షాలకూ సమాన ప్రాధాన్యత కల్పించారు. బోర్డు సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక సీఈవోతో పాటు ఐటీ, ఆర్థిక, పంచాయతీరాజ్, ఇంధన శాఖల ఉన్నతాధికారులు నలుగురు డైరెక్టర్లుగా వ్యవహరిస్తారు. అలాగే కేంద్ర ప్రభుత్వం తరఫున ఎక్స్ అఫీషియో ఛైర్మన్‌తో పాటు మరో నలుగురు డైరెక్టర్లు ప్రాతినిధ్యం వహిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో సేవలందిస్తున్న తెలంగాణ ఫైబర్‌గ్రిడ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఈ కొత్త కార్పొరేషన్‌కు కూడా సీఈవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారుతెలంగాణకు గరిష్ట ప్రయోజనం చేకూర్చేలా కొత్త కార్పొరేషన్ ఏర్పాటు నిబంధనల్లో కొన్ని కీలక వెసులుబాట్లు కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి భారీ నిధులను ఆమోదించింది. కార్పొరేషన్ నిర్వహణ, విద్యుత్ బిల్లులు, ఇతర సాంకేతిక అవసరాల కోసం ఏటా రూ.260 కోట్ల చొప్పున.. రాబోయే పదేళ్ల కాలానికి గానూ మొత్తం రూ.2600 కోట్ల భారీ నిధుల విడుదలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.దీంతో పాటు భారత్ నెట్ ఉద్యమి ప్రోగామ్ కింద తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీని మరింత వేగవంతం చేసేందుకు కేంద్రం ప్రత్యేక ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. ఇందులో భాగంగా తొలి విడతలోనే రాష్ట్రంలోని పల్లెటూళ్లలో



3 లక్షల గృహాలకు ఉచిత ఇంటర్నెట్ కనెక్షన్లు ఇవ్వనున్నారు. ఒక్కో కనెక్షన్‌కు రూ.10వేల చొప్పున మొత్తం రూ.300 కోట్లను కేంద్రం భరించనుంది. గతంలో నిర్మించిన భారత్ నెట్ ఫేజ్-1, 2 నెట్‌వర్క్‌లను అత్యాధునికంగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు ఇప్పటివరకు కనెక్టివిటీ లేని మారుమూల గ్రామాలకు ఇంటర్‌నెట్ సదుపాయం కల్పించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం ఉన్న టీ-ఫైబర్ జిల్లా, మండల కేంద్రాల వరకే నెట్‌వర్క్‌ను నిర్వహిస్తుండగా.. కొత్తగా ఏర్పాటైన టీఆర్ఐఐసీఎల్ మండల కేంద్రాల నుండి చివరి గ్రామ స్థాయి వరకు ఇంటర్నెట్ నెట్‌వర్క్‌ను తీసుకెళ్లి దాని నిర్వహణ బాధ్యతలను పర్యవేక్షించనుంది.

# సీబీఎస్ఈ వివాదం..రంగంలోకి కేంద్రం

న్యూఢిల్లీ, జూన్ 3 (

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకెండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్-స్క్రీన్ మార్కింగ్ రీవేల్యూయేషన్ ప్రక్రియలో లోపాలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. బోర్డు ఛైర్మన్ రాహుల్ సింగ్, కార్యదర్శి హిమాంశు గుప్తాలనుబదిలీ చేసింది. వారి స్థానంలో కొత్త ఛైర్మన్‌గా లోఖండే ప్రశాంత్ సీతారామ్, కార్యదర్శిగా వరుణ్ భరద్వాజ్‌ను నియమించింది. అంతేకాదు,ఈ వివాదంపై విచారణకు కమిటీని నియమించింది. ఛైర్మన్ హోదాలో సీబీఎస్ఈ బోర్డు మొత్తం పనితీరు, పరిపాలన బాధ్యతలను రాహుల్ సింగ్ నిర్వర్తిస్తుండగా.. బోర్డుకు సంబంధించిన చట్టపరమైన అంశాలు, ఆడిట్, ప్రజా సంబంధాలు వంటి విభాగాలను హిమాంశు చూసుకుంటున్నారు.ఆన్-స్క్రీన్ మార్కింగ్ విధానం అమలు, విద్యార్థులు నుంచి వచ్చిన సమస్యలపై విచారణ జరిపేందుకు ఒక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. సామర్థ్య నిర్మాణ కమిషన్ ఛైర్‌పర్సన్ ఎస్. రాధా చౌహాన్ ఈ ఏకసభ్య కమిటీకి అధ్యక్షత వహిస్తారు. ఈ కమిటీ తన నివేదికను నెలలోగా సిబ్బంది వ్యవహారాలు- శిక్షణ విభాగానికి సమర్పిస్తుంది. మరోవైపు, ఓఎస్ఎం అమలు, విద్యార్థులు నివేదించిన సమస్యలపై కమిటీ సభ్యులకు వివరించడానికి స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రెటరీ సంజయ్ కుమార్‌తో పాటు రాహుల్ సింగ్‌కు పార్లమెంటరీ ప్యానెల్ సమన్లు జారీ చేసింది.జవాబు పత్రాలు తారుమారు కావడం, మూల్యాంకనంలో తప్పులు, తప్పుడు దిశానిర్దేశం, తప్పుడు గ్రేడ్‌ల కేటాయింపు వంటి అనేక సమస్యలు ఉన్నాయి. స్కాన్ చేసిన కాపీల తమవి కావని కనుగొన్నారు. మూల్యాంకన ప్రక్రియలో సుమారు 20 జవాబు పత్రాల పొంతన లేనివిగా గుర్తించినట్లు సీబీఎస్ఈ అధికారులు అంగీకరించారు. వేదాంత్ అనే విద్యార్థి తన సమాధాన పత్రం కాదని, వేరే ఎవరో రాసిన పేపర్లు తనదాంటో కలిపేశారని ఆరోపిస్తూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ వైరల్ అయ్యింది.

# కోనరావుపేట మండలంలో ప్లాస్టిక్ రహిత ధర్మారం లక్ష్యంగా ముందడుగు.

## –దుకాణాలపై గ్రామ కార్యదర్శి, పంచాయతీ పాలకవర్గం ఆకస్మిక తనిఖీలు, నోటీసుల జారీ.

రాజన్న సిరిసిల్ల, భారత శక్తి ప్రతినిధి, జూన్ 3:



పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా, ప్రభుత్వం చేపట్టిన ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయడంలో కోనరావుపేట మండలం ధర్మారం గ్రామ పంచాయతీ కఠినంగా వ్యవహరిస్తోంది. గ్రామంలోని కిరాణా దుకాణాలు, వ్యాపార సంస్థలలో ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి బండారి మనిష ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ వాడుతున్న దుకాణదారులకు నోటీసులు జారీ చేశారు. ఈ తనిఖీల్లో వార్డు సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొని వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఏకపక్షంగా ప్లాస్టిక్ కవర్లు, నాణ్యత లేని ప్లాస్టిక్ సంచులను వాడటం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ, వాటిని వెంటనే నిలిపివేయాలని హెచ్చరించారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌కు బదులుగా పేపర్ బ్యాగులు, జనపనార సంచులను వాడాలని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే భారీ జరిమానాలు ఉంటాయని స్పష్టం చేశారు.

# జూన్ 7లోగా మొక్కజొన్న సేకరణ పూర్తి చేయాలి

## -పద్మాజీవాడి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 03 : జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు.

బుధవారం ఆయన సదాశివనగర్ మండలం పద్మాజీవాడి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు, రవాణా ప్రక్రియల పురోగతిని పరిశీలించారు.

ఈ సందర్భంగా కేంద్రం ద్వారా ఇప్పటివరకు 18,840 క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇందులో 15,000 క్వింటాళ్ల మొక్కజొన్నను ఇప్పటికే గోదాములకు తరలించగా, ప్రస్తుతం కేంద్రం వద్ద 3,840 క్వింటాళ్ల మొక్కజొన్న నిల్వ ఉన్నట్లు తెలిపారు.

అలాగే కేంద్రంలో ఇంకా 16 మొక్కజొన్న కుప్పలు ఉండగా, వాటి ద్వారా సుమారు 3,000 సంచుల మొక్కజొన్న కొనుగోలు జరిగే అవకాశం ఉందని వివరించారు.

కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలు, సూచనలను తెలుసుకున్నారు. జూన్ 7వ తేదీలోగా మొక్కజొన్న సేకరణ ప్రక్రియను పూర్తిచేయాలని డీఎం మార్క్‌ఫెడ్‌ను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వేగంగా గోదాములకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర ప్రయోజనాలు పూర్తిగా అందేలా చూడాలని, కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్, జిల్లా సహకార అధికారి (డీసీఓ), డీఎం మార్క్‌ఫెడ్, జిల్లా పౌర సరఫరాల అధికారి (డీసీఎస్ఓ), డీఎం (సివిల్ సప్లైస్), తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ అధికారి (ఎంఏఓ), మానిటరింగ్ అధికారి, పీఏసీఎస్ అధ్యక్షులు, సర్పంచ్, వార్డు సభ్యులు, పీఏసీఎస్ కార్యదర్శి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# అదిలాబాద్ ఇంచార్జ్ డీపీఆర్వో విష్ణువర్ధన్‌కు జన్మదిన శుభాకాంక్షలు



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 03:(భారత శక్తి) అదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ డీపీఆర్వో విష్ణువర్ధన్ జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా సీనియర్ జర్నలిస్టులు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. విష్ణువర్ధన్ ప్రజా సంబంధాల శాఖలో అందిస్తున్న సేవలను కొనియాడుతూ, ఆయనకు ఆయురారోగ్యాలు, మరిన్ని ఉన్నత విజయాలు కలగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, నరసయ్యతోపాటు మీడియా ప్రతినిధులు పాల్గొని విష్ణువర్ధన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# జూన్ 5న హైదరాబాదులో జరిగే ర్యాలీ ధర్నాను విజయవంతం చేయండి

–విద్యా పరిరక్షణ కమిటీ , నిజామాబాద్ జిల్లా



ఆర్మూర్, భారత శక్తి న్యూస్,జూన్ 3:ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించడం కోసం తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జూన్ 5న హైదరాబాదులో జరిగే ర్యాలీ ధర్నా విజయవంతం కోసం గోడపత్రిక మరియు కరపత్రాల ఆవిష్కరణ సిద్ధార్థ డిగ్రీ కాలేజ్ ఆర్మూర్ లో జరిగినది.

ఈ సందర్భంగా తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు పి. శంతన్, ఎం. బాలయ్య, కె.ఓమాజి, విజయ్ కుమార్, నరేందర్ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ ప్రతిష్టతకు కేంద్ర ప్రభుత్వము తన బడ్జెట్లో 10 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వము తన బడ్జెట్లో 20 శాతం నిధులు కేటాయించాలని , ప్రస్తుతం కొనసాగుతున్న రెసిడెన్షియల్ స్కూళ్లకే పక్కా భవనాలు, భౌతిక వసతులు కల్పించి ప్రభుత్వం ఆశించిన యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను ఎత్తివేయాలని తెలంగాణ రాష్ట్రంలో జూనియర్ కళాశాలలను వేలాది పాఠశాలలను పాతర వేసే తెలంగాణ పబ్లిక్ స్కూల్ మరియు ఫౌండేషన్ స్కూల్ స్థాపనను మానుకోవాలని అన్ని ప్రభుత్వ పాఠశాలలని సెమి రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చాలని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారువిద్యాశాఖ విడుదల చేసిన ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను తక్షణమే విరమించుకోవాలని, మధ్యాహ్న భోజన పథకంలో అల్పాహారము స్నాక్స్ కు సంబంధించిన విషయంలో ఇస్కాన్ సంస్థకు వందేమాతర ఫౌండేషన్లకు అప్పజెప్పే నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరారు. పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న బోధన ,బోధనేతర సిబ్బంది పోస్టులను మరియు ఎంఈఓ డీఈవో పోస్టులను తక్షణమే భర్తీ చేసి పర్యవేక్షణను పెంచాలన్నారు.

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ కి బదులు రాష్ట్రంలోనున్న 17 విశ్వ విద్యాలయాలను బలోపేతం చేయాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు ఏక్ నాథ్, మదర్, ఓ. శ్రీనివాస్, వినోద్, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 3:



పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కొనరావుపేట మండలం మర్తనపేట గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్: మైనారిటీ విద్యార్థులకు సువర్ణావకాశం.

భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 3:

విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలని లక్ష్యంగా పెట్టుకున్న మైనారిటీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. 'చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్' పథకం ద్వారా అర్హులైన విద్యార్థులకు ఆర్థిక సహకారం అందించేందుకు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ ఏడాది జనవరి 1 నుంచి జూన్ 30 మధ్య (స్ప్రింగ్ సీజన్ 2026) అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, దక్షిణ కొరియా, జపాన్, ఫ్రాన్స్, న్యూజిలాండ్ దేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో పీజీ (పీజీ), డాక్టరేట్ (పీహెచ్‌డీ) కోర్సుల్లో ప్రవేశం పొందిన మైనారిటీ విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు www.telanganaepass.cgg.gov.inµ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తయ్యాక, దాని హార్డ్ కాపీని మరియు సంబంధిత ధృవపత్రాలను జూలై 31వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని మొదటి అంతస్తులో ఉన్న జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో (రూం నం. ఎఫ్–26) అందజేయాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి (ఎఫ్.ఎ.సి) అయేషా తలత్ తెలిపారు. ఈ పథకం కింద ఎంపికైన విద్యార్థులకు రూ. 20 లక్షల వరకు స్కాలర్‌షిప్‌తో పాటు, వన్–వే విమాన ఛార్జీ లేదా వాస్తవ ఛార్జీ.. ఈ రెండింటిలో ఏది తక్కువైతే ఆ మొత్తాన్ని ప్రభుత్వం అందజేస్తుంది. దరఖాస్తుల పరిశీలన సమయంలో అభ్యర్థులు సమర్పించిన ధృవపత్రాలు నకిలీవని తేలితే, వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారి స్పష్టం చేశారు. పథకానికి సంబంధించిన వయస్సు, విద్యార్హతలు, వార్షికాదాయం వంటి పూర్తి వివరాల కోసం సంబంధిత వెబ్‌సైట్‌ను చూడాలని, ఇతర సందేహాల కోసం 9949910328 నంబరును సంప్రదించాలని ఆమె సూచించారు.

# ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు - గుట్కా విక్రయిస్తే కఠిన చర్యలు.

భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 3:

జిల్లా కేంద్రంలో ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో పట్టణంలోని కిరాణా దుకాణాలు, పాన్ షాపుల్లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని పరిశుభ్రత ప్రమాణాలు, ఆహార భద్రత నిబంధనలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. షాపుల్లో ఎక్కడైనా నిషేధిత పాన్ పరాగ్, గుట్కా వంటి హానికర పదార్థాలు కనిపిస్తే ఉపేక్షించేది లేదని, వెంటనే కేసులు నమోదు చేస్తామని యజమానులను తీవ్రంగా హెచ్చరించారు. దుకాణదారులకు కౌన్సిలింగ్ ఇచ్చి, నిబంధనలను పాటించాలని సూచనలు చేశారు. అనారోగ్యానికి కారణమయ్యే పొగాకు, గుట్కా వంటి పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# పీఎంజే జ్యువెలరీ దోపిడీ గ్యాంగ్‌స్టర్ సుబోధ్ సింగ్ కస్టడీకి.

భారత శక్తి న్యూస్, కరీంనగర్, జూన్ 3:

నగరంలోని జ్యోతినగర్‌లో గల పీఎంజే జ్యువెలరీ షోరూం దోపిడీ కేసులో సూత్రధారి, కుఖ్యాత గ్యాంగ్‌స్టర్ సుబోధ్ సింగ్‌ను పోలీసులు నాలుగు రోజుల పాటు తమ కస్టడీలోకి తీసుకున్నారు. ఈ మేరకు కరీంనగర్ కోర్టు అనుమతినిచ్చింది. మే 3న జరిగిన ఈ దోపిడీ ఘటనలో దుండగులు జరిపిన కాల్పులు నగరంలో తీవ్ర కలకలం రేపిన విషయం విదితమే.

ఈ దోపిడీకి పాల్పడిన ఐదుగురిలో ఇప్పటికే ఇద్దరు నిందితులను, వారికి సహకరించిన సిమ్ కార్డు విక్రేతను పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో భాగంగా దేశవ్యాప్తంగా జరిగిన పలు సంచలనాత్మక దోపిడీలకు బీహార్‌లోని పూర్ణియా జైలులో ఉంటున్న సుబోధ్ సింగే సూత్రధారి అని తేలింది. సుమారు 400 కిలోల బంగారాన్ని దోచుకెళ్లిన ముఠాల వెనుక ఇతని హస్తం ఉన్నట్లు ప్రాథమిక ఆధారాలు లభించడంతో, కరీంనగర్ పోలీసులు పీటీ వారెంట్ ద్వారా బీహార్ కోర్టు అనుమతి పొంది, గత నెల 28న అతడిని కరీంనగర్‌కు తరలించారు. అనంతరం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న సుబోధ్ సింగ్‌ను విచారించేందుకు కోర్టును కోరగా, కస్టడీకి అనుమతి లభించింది. సుబోధ్‌తో పాటు ఈ కేసులో సంబంధం ఉన్న మరో ముగ్గురు నిందితులను కూడా పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ కస్టడీ విచారణ ద్వారా దోపిడీకి సంబంధించిన పూర్తి వివరాలు, ఇతర గ్యాంగ్‌ల పనితీరుపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని పోలీసు వర్గాలు వెల్లడించాయి.

# అప్పు విషయంలో యువకుడిపై దాడి. -అవమానంతో ఉరివేసుకుని ఆత్మహత్య.

భారత శక్తి ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, జూన్ 3:



అప్పు తీసుకున్న డబ్బుల విషయంలో జరిగిన గొడవ, దాడి ఓ యువకుడి ప్రాణాలు తీసింది. ఈ విషాదకర సంఘటన తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఉపేంద్ర చారి తెలిపిన వివరాల ప్రకారం.. ఓబులాపూర్ గ్రామానికి చెందిన కొత్తకొండ బాలకిషన్ (26) గతంలో అదే గ్రామానికి చెందిన దోమల కొమురయ్య వద్ద 3,000 రూపాయలు అప్పు తీసుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం దోమల హరీష్, దోమల వంశీ అనే వ్యక్తులు ఆ డబ్బుల గురించి బాలకిషన్‌తో వాగ్వాదానికి దిగారు. విషయం తీవ్రస్థాయికి చేరుకోవడంతో వారు బాలకిషన్‌ను బూతులు తిట్టడమే కాకుండా, కర్రతో చితకబాదారు. గ్రామస్తుల సమక్షంలో జరిగిన ఈ దాడితో తీవ్ర అవమానానికి గురైన బాలకిషన్ మనస్తాపం చెందాడు. నేరుగా తన ఇంటికి వెళ్ళిన యువకుడు, ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లి కొత్తకొండ బాలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టి దర్యాప్తు చేస్తున్నారు.

# జాప్యం వద్దు.. కొనుగోళ్లు ముమ్మరం చేయండి: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 3 (భారత శక్తి): రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండలంలోని ఓం రైస్ మిల్, బెజ్జాల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం, అన్నపూర్ణ రైస్ మిల్, కిష్టాపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం, సుముఖ గోదాం లను మండల తహసిల్దార్ వనజా రెడ్డి తో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సంవత్సరం దాదాపు 1 లక్ష 60 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉందని తెలిపారు. హమాలీల సమస్యను అధిగమించేందుకు స్థానికంగా హమాలీలను తీసుకొని ధాన్యం ఎగుమతి, దిగుమతులను వేగవంతం చేయడం జరిగిందని తెలిపారు. చివరి గింజ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెద్దపల్లి, కరీంనగర్ లలో హమాలీలతో కలిపి 2 గోదాములను ఇచ్చారని, అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు నష్టం కలుగకుండా ధాన్యం నిల్వ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈసారి ధాన్యం తరలించేందుకు ట్రాక్టర్లను సైతం వినియోగించుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దాదాపు 10 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంటను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు తరలించిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని, నిర్దేశిత సి.ఎం.ఆర్. లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.



# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి: జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 3 (భారతశక్తి): బెల్లంపల్లి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. బుధవారం జిల్లాలోని బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను మండల తహసిల్దార్ కృష్ణ, మున్సిపల్ కమిషనర్ రమేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వాతి, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అమృత్ 2.0 పనులను వేగవంతం చేయాలని, సంబంధిత అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో పని చేయాలని, పెండింగ్ అంశాలను వెంటనే పరిష్కరించి నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని తెలిపారు. ప్రతిపాదిత నూతన డంపింగ్ యార్డ్ స్థలాన్ని పరిశీలించి ఘన వ్యర్థాల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటు, భూ లభ్యత, పర్యావరణ ప్రమాణాల అమలుపై చర్యలు చేపట్టాలని, పట్టణ పరిశుభ్రతను మెరుగుపర్చేందుకు ఆధునిక వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను అభివృద్ధి చేయాలని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ జోన్, పాత డంపింగ్ యార్డ్‌ను సందర్శించిన అదనపు కలెక్టర్, భూ సంబంధిత అంశాలు, నిర్వహణ పరిస్థితులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మార్కెట్ యార్డ్‌లోని ఆక్రమణలను పరిశీలించి ప్రజా అవసరాలకు సంబంధించిన స్థలాలను ఆక్రమణల నుండి విముక్తం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చట్టపరమైన చర్యలతో ఆక్రమణలను తొలగించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు మంజూరైన బిల్లులు, గృహ నిర్మాణ పురోగతి, సమస్యలను పరిష్కరించేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. బెల్లంపల్లి నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్ఓ) హోదాలో బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎన్నికల సేవలు, ఓటరు జాబితా సంబంధిత సేవలు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల పర్యవేక్షకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాల నిర్వహణ, దరఖాస్తుల పరిష్కారం, ఎన్నికల విధుల నిర్వహణలో పారదర్శకత పాటించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ సిబ్బంది, ఎన్నికల పర్యవేక్షకులు, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం తరలింపునకు అదనపు లారీలు కేటాయించాలి: జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 3 (భారత శక్తి): జిల్లాలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేయబడిన వరి ధాన్యం తరలింపునకు అదనపు లారీలు కేటాయించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండలంలోని కొత్తూరు గ్రామంలో గల జై యోగేశ్వర రైస్ మిల్లును తహసీల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని, ఈ క్రమంలో తరలించబడిన ధాన్యాన్ని లారీల నుంచి త్వరితగతిన దిగుమతి చేసి, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని రైస్ మిల్లర్ ను ఆదేశించారు. ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేసి, లారీల నిల్వ సమయాన్ని తగ్గించాలని సూచించారు.

– అనంతరం లక్షెట్టిపేట మండల తహసిల్దార్ కార్యాలయంలో ఐకేపీ సీసీలు, పీఏసీఎస్ సీసీలు, సెక్టార్-1 సిబ్బంది, రవాణా గుత్తేదారుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే తరలించేందుకు అదనపు వాహనాలను ఏర్పాటు చేయాలని రవాణా గుత్తేదారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు, రవాణా, దిగుమతి ప్రక్రియలు జాప్యం కాకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేసి, రైతులకు సకాలంలో సేవలు అందించాలని తెలిపారు.

# మాజీ మంత్రివర్యులు హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు

## -జిన్నారం జి. వెంకటేశం గౌడ్ బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు

జిన్నారం మున్సిపల్,జూన్ 03, భారత శక్తి న్యూస్: తెలంగాణ ప్రజల హృదయాలలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న మాజీ మంత్రివర్యులు, ప్రజానాయకులు హరీష్ రావు జన్మదిన సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తెలంగాణ పోరాట ఉద్యమ నాయకులు జిన్నారం జి.వెంకటేశం గౌడ్,

మాజీమంత్రి హరీష్ రావు నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తెలంగాణ ఉద్యమ పోరాట నాయకుడు జిన్నారం జి.వెంకటేశం గౌడ్, మాట్లాడుతూ...తెలంగాణ అభివృద్ధికి, రైతాంగ సంక్షేమానికి, ప్రజా సేవకు హరీష్ రావు అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండే నాయకుడిగా హరీష్ రావు కోట్లాది మంది అభిమానాన్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు.భగవంతుడు వారికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించి మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, బొల్లారం బాల్ రెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు హైకోర్టు న్యాయవాది ఐలాపూర్ మాణిక్ యాదవ్, సోమిరెడ్డి,తొంట అంజయ్య యాదవ్, జగన్నాథ్ రెడ్డి, శివ, ఆనంద్, సత్యనారాయణ,తదితర బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొని హరీష్ రావుకు సమిష్టిగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



# కొమిరెడ్డి సేవలు మరువలేనివి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల, జూన్ 3 (భారత్ శక్తి ప్రతినిధి):

న్యాయవాదిగా, రాజకీయ నాయకుడిగా, ప్రజాప్రతినిధిగా కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంత ప్రజలకు మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు అందించిన సేవలు మరువలేనివని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.

బుధవారం మెట్‌పల్లిలో నిర్వహించిన కొమిరెడ్డి రాములు జయంతి వేడుకల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా కొమిరెడ్డి రాములు, జ్యోతక్క విగ్రహాల ఏర్పాటుకు ప్రభుత్వం తరపున సహకరిస్తామని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులు సూచించిన ప్రదేశంలో వచ్చే జయంతిలోపు విగ్రహాల ఏర్పాటును పూర్తి చేస్తామని తెలిపారు.స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ నర్సింగరావు పర్యవేక్షణలో విగ్రహాల ఏర్పాటుకు సంబంధించిన పనులను చేపట్టాలని మంత్రి సూచించారు. వచ్చే జయంతిలోపు విగ్రహాల ఏర్పాటు ప్రక్రియ పూర్తికావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నందయ్యతో పాటు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# 25 ఏళ్ల తర్వాత అపూర్వ కలయిక

జిన్నారం, భారత శక్తి ప్రతినిధి, జూన్ 3: జిన్నారం మున్సిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2000-01 పదో తరగతి పూర్వ విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. పాత మిత్రులతో మళ్లీ కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొంటూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



# వానకొండయ్య గుట్ట మైనింగ్ పర్మిషన్ రద్దు చేయాలి: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

జనగామ (భారత శక్తి)జూన్ 3:

జనగామ జిల్లా, దేవరుప్పుల మండలం లకావత్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ వానకొండయ్య లక్ష్మి నరసింహ స్వామి స్వయానా కొలువైన క్షేత్రం మైనింగ్ మాఫియా చేతిలో పడి ఉనికి కోల్పోతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఈ సందర్భంగా జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ను దేవరుప్పుల మండల బిఆర్ఎస్ బృందంతో కలిసి ఆ మైనింగ్ పనులు అడ్డుకున్నందుకు ఇచ్చిన నోటీసులకు సమాధానం తెలిపి ఎట్టి పరిస్థితుల్లో మైనింగ్ జరగకుండా చూడాలని కలెక్టర్ గారిని కోరటం జరిగింది.గుట్ట వద్ద మైనింగ్ పనులు జరుగుతే అ దేవాలయం ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ పనులను ఆపి దేవస్థానం యొక్క మనుగడను కాపాడి రెండు కోట్ల రూపాయలతో దేవాలయ అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. మళ్లీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్ల అ యొక్క పనులను మొదలు పెట్టారని మండిపడ్డారు. ఆనాడు కూడా ఈ మైనింగ్ వాళ్లు ఆన్ లైన్ లో పర్మిషన్ తెచ్చుకుంటే గ్రామ తీర్మానం లేదని దేవుడి గుట్ట ఉనికి దెబ్బ తింటుందని ఆపింది మేము ఈ రోజు అధికారంలోకి వచ్చిన వీళ్లు మాపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు.గుట్ట వద్దకు బిఆర్ఎస్ నాయకులు వెళ్లి పనులను అడ్డుకోవడానికి వెళ్తే మా నాయకుల మీద కేసులు పెట్టి, నోటీసులు పంపించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని నేడు ఆ నోటీసులకు జనగామ జిల్లా కలెక్టర్ గారికి జవాబు ఇవ్వడం జరిగింది. ఆ మైనింగ్ వాళ్ళని కూడా విచారించగా వారు కూడా మాకు గ్రామ పంచాయతీ తీర్మానం ఆనాడు లేదు ఈనాడు లేదు అని తెలిపారు

ఏది ఏమైనా ఈ ప్రభుత్వం వానకొండయ్య గుట్ట మైనింగ్ పనులు ఆపకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. వీటితో పాటు పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కూడా ప్రభుత్వం తొందరగా కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# గోదావరి పుష్కరాల పనులకు అదనపు బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలి మంత్రి అడ్లూరి

జగిత్యాల, జూన్ 3 (భారత శక్తి ప్రతినిధి):





గోదావరి పుష్కరాలు-2027 అభివృద్ధి పనులకు సంబంధించి అదనపు బడ్జెట్ ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కోటిలింగాల, ధర్మపురి క్షేత్రాలకు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున రోడ్ల విస్తరణ, వంతెనల నిర్మాణం, ట్రాఫిక్ నిర్వహణ, పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి ఘాట్ వద్ద తాగునీరు, పారిశుద్ధ్యం, దుస్తులు మార్చుకునే షెడ్లు, భద్రతా ఏర్పాట్లు కల్పించాలని ఆదేశించారు. ధర్మపురిలో హెలీప్యాడ్‌తో పాటు ఇతర మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ, కోటిలింగాల, ధర్మపురి పుష్కరాల ఏర్పాట్ల కోసం ప్రభుత్వం తొలి విడతలో రూ.117 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. మంజూరైన నిధులతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, దేవాదాయ శాఖ, మున్సిపల్ శాఖ, ఆర్‌డబి, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలి : సదాశివపేట వ్యవహారాల ఇంచార్జ్ తోపాజి అనంత్ కిషన్

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 3 :



రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త, నాయకుడు పని చేయాలని టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్ అన్నారు. బుధవారం సదాశివపేట పేట పట్టణం లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సదాశివపేట కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జీ గా తోపాజి అనంత్ కిషన్ నియామకం అయిన అనంతరం జరిగిన మొదటి సమావేశం ఇది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు తోపాజి అనంత్ కిషన్, సిడిసి చైర్మెన్ రామ్ రెడ్డి లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తోపాజి అనంత్ కిషన్ మాట్లాడుతూ సదాశివపేట మున్సిపాలిటీ లో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ లు, వార్డ్ ఇంచార్జి లు అందరూ సమన్వయం తో పనిచేయాలన్నారు. ఎవరి వార్డు పరిధి లో వారు పనిచేయాలని, కాంగ్రెస్ అభ్యర్థులు గెలవని వార్డుల్లో వార్డ్ ఇంఛార్జ్ లదే పూర్తి బాధ్యత వహించాలన్నారు. కాంగ్రెసు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. జగ్గారెడ్డి, డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి సారథ్యం లో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు మునిపల్లె సత్యనారాయణ, చిరు, వాసిం, సిద్దన్న, కంది కృష్ణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీహరి, పట్నం సుభాష్, చోటు భాయ్, మున్సిపల్ కౌన్సిలర్లు శంకర్ గౌడ్, అరుణ్ కుమార్, నాగరాజు, నర్సింలు, విష్ణు వర్ధన్ రెడ్డి, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో ఘనంగా పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ శిబిరం.

భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 3:

భారతీయ జనతా పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ శిబిరం జిల్లా కేంద్రంలోని వాసవి కళ్యాణ మండపంలో వైభవంగా ప్రారంభమైంది. జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి అధ్యక్షతన జరిగిన ఈ శిబిరానికి బిజెపి జాతీయ నాయకులు మురళీధర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెండు రోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి సుమారు 250 మంది ప్రతినిధులు, పదాధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన అనంతరం మురళీధర్ రావు మాట్లాడుతూ, బిజెపి కేవలం రాజకీయ పార్టీ మాత్రమే కాదని, అది జాతీయ పునర్నిర్మాణానికి అంకితమైన ఉద్యమమని ఉద్ఘాటించారు. సిద్ధాంతాలు, విలువలు, క్రమశిక్షణే పార్టీకి పునాదని, వాటిని పుణికిపుచ్చుకున్న కార్యకర్తలే ప్రజల్లో పార్టీ పట్ల విశ్వాసాన్ని పెంపొందించగలరని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ వేదికపై అగ్రగామిగా ఎదుగుతోందని, కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు చొరవ చూపాలని సూచించారు. జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి శిక్షణా తరగతులు ఎంతో కీలకమని, గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రతి కార్యకర్త సిద్ధాంతాల పట్ల అవగాహన




పెంచుకోవాలనే లక్ష్యంతో ఈ శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ రెండు రోజుల పాటు బిజెపి చరిత్ర, వికాసం, సంస్థాగత నిర్మాణం, సోషల్ మీడియా వినియోగం, ఎన్నికల నిర్వహణ వంటి అంశాలపై నిపుణులు, సీనియర్ నాయకులు దిశానిర్దేశం చేయనున్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు, మాజీ జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, జిల్లా ఇన్చార్జి గంగాడి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు సిరికొండ శ్రీనివాస్, కరెడ్ల మధుకర్, రాష్ట్ర నాయకులు ఎర్ర మహేష్, లింగంపల్లి శంకర్, అల్లాడి రమేష్, కుమ్మరి శంకర్, చంటి మహేష్, ఆడెపు రవీందర్, దశరథం రెడ్డి తదితర ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిండు ప్రాణాన్ని నిలబెట్టిన కానిస్టేబుల్. చాకచక్యంగా స్పందించి సీపీఆర్ చేసిన భాస్కర్.

భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 3:

ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక వ్యక్తిని పోలీస్ కానిస్టేబుల్ తన సమయస్ఫూర్తితో కాపాడి అందరి ప్రశంసలు అందుకున్నారు. సిరిసిల్ల జిల్లా కోర్టు ఆవరణలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇల్లంతకుంట మండలం కట్కూరు గ్రామానికి చెందిన వెంకటేశం అనే వ్యక్తి ఒక కేసు నిమిత్తం కోర్టుకు హాజరయ్యారు. ఆ సమయంలో ఒక్కసారిగా గుండెపోటుకు గురై ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. ఆ సమయంలో కోర్టు విధుల్లో ఉన్న కోనరావుపేట పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ భాస్కర్ వెంటనే అప్రమత్తమయ్యారు. బాధితుడి పరిస్థితిని గమనించి ఏమాత్రం ఆలస్యం చేయకుండా సీపీఆర్ చేశారు. దీంతో వెంకటేశం స్పృహలోకి రావడంతో ప్రాణాపాయం తప్పింది. పోలీసులకు ఉన్నతాధికారులు అందించిన సీపీఆర్ శిక్షణ ఇక్కడ ఒక నిండు ప్రాణాన్ని కాపాడింది. సకాలంలో స్పందించి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ భాస్కర్ ను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ప్రత్యేకంగా అభినందించారు. భాస్కర్ చూపిన చాకచక్యంపై నెటిజన్లు సైతం సోషల్ మీడియా వేదికగా ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

# జిల్లా మహిళ సమాఖ్య పెట్రోల్ బంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య

జనగామ(భారత శక్తి)జూన్ 3:

హనుమకొండ జిల్లా మడికొండలోని మహిళా ప్రాంగణంలో డీఆర్‌డీఏ, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) ఆధ్వర్యంలో మహిళా సంఘాల సాధికారతకు తోడ్పాటుగా 1 కోటి 50 లక్షల తో నిర్మించనున్న జిల్లా మహిళ సమాఖ్య పెట్రోల్ బంక్ నిర్మాణానికి స్థానిక శాసన సభ్యులు కె.ఆర్ నాగరాజు గారితో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య గారు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్యమాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారతే సమాజ అభివృద్ధికి బలమైన పునాదని అన్నారు. మహిళల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ద్వారా మహిళలను లబ్ధిదారులుగా మాత్రమే కాకుండా యజమానులుగా, స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకునే స్థాయికి తీసుకెళ్తోందన్నారు. మహిళలకు అవకాశం కల్పిస్తే వారు ఏ రంగంలోనైనా అద్భుత విజయాలు సాధించగలరని, ఇంటిని చక్కదిద్దే మహిళకు అవకాశం ఇస్తే వ్యాపారం, పరిశ్రమ, వ్యవసాయం, సేవా రంగం ఇలా అన్ని రంగాల్లోనూ తన ప్రతిభను చాటగలరని పేర్కొన్నారు.

అదే విధంగా నేడు మడికొండలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషకరమని, ఇకపై "మడికొండలో మహిళలు నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్ ఉంది" అని గర్వంగా చెప్పుకునే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు.

మహిళా సంఘాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఐకేపీ కార్యక్రమాలు, సోలార్ రంగం వంటి అనేక రంగాల్లో మహిళలు విజయవంతంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. ముఖ్యంగా మహిళలను నాయకత్వ స్థానాల్లో నిలబెట్టే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా మహిళలను ప్రోత్సహిస్తోందని చెప్పారు.

ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళల ఆర్థిక స్వావలంబన కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసి ఆదాయ వనరులు పెంచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని



తెలిపారు. జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్మించబడనున్న ఈ పెట్రోల్ బంక్ మహిళలకు స్థిరమైన ఆదాయాన్ని అందించడమే కాకుండా, మరెంతో మందికి ఆదర్శంగా నిలున్తుందని పేర్కొన్నారు. మహిళలు కుటుంబానికి, సమాజానికివెన్నెముకలాంటివారని, వారు ఆరోగ్యంగా, బలంగా ఉంటేనే కుటుంబాలు సంతోషంగా ఉంటాయని అన్నారు. అందుకే మహిళలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మహిళల సంక్షేమం, సాధికారత కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇస్తూ, మహిళలు అన్ని రంగాల్లో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, ఐజుణా శ్రీనివాస్, దీూజా వీణ సుధీర్, ముఖ్య నాయకులు, ఐకేపీ (×ఖూ) రీజినల్ కోఆర్డినేటర్లు, సీసీలు మరియు స్వయం సహాయక సంఘాల (ూ౧+) మహిళా ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

# కొండాపూర్ లో ఎండవేడికి ఉపాధి కూలీల తల్లడిల్లింపు.. అండగా నిలిచిన వార్డు సభ్యులు.

భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 3:




?భానుడు భగభగ మండుతున్నాడు. ఉదయం పది గంటలు దాటితే చాలు.. నిప్పులు చెరుగుతున్న ఎండలకు ప్రాణాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ఇటువంటి తీవ్ర పరిస్థితుల్లోనూ ఉపాధి హామీ పనులకు వెళ్తున్న కూలీల కష్టాన్ని గుర్తించిన కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన ముగ్గురు వార్డు సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు. కూలీల దాహార్తిని తీర్చేందుకు వారు చేసిన ప్రయత్నం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లిన వార్డు సభ్యులు అంకమల్ల రవీందర్ (1వ వార్డు), అనుముల దేవయ్య (6వ వార్డు), మాలోత్ సుధాకర్ (8వ వార్డు) కూలీల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మండుటెండలో పనులు చేయడం వల్ల కలిగే ఆరోగ్య ఇబ్బందులను గమనించి, ఆకలితో అలమటించే వారిని దృష్టిలో ఉంచుకుని వారికి ఉప్మా, మజ్జిగను అందజేశారు. కూలీల సంక్షేమం కోసం తాము తీసుకున్న ఈ నిర్ణయం వారిలో కొంత ఉపశమనాన్ని కలిగించింది. ఈ కార్యక్రమంలో భాగంగా వార్డు సభ్యులు మాట్లాడుతూ, కూలీలు ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తగినంత నీరు తీసుకోవాలని సూచించారు. తాము చేసిన చిన్న సాయం వారి అలసటను కొంతైనా తగ్గిస్తుందని ఆశిస్తున్నామని వారు తెలిపారు.

# విజిలెన్స్ కమిటీకి సభ్యుల ఆహ్వానం.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 03 (భారత శక్తి): స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ (ఖూఎవీజ)-ూాజ=/ూూా చట్టం కింద సభ్యుల ఎంపికకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారులు తెలిపారు. కమిటీలో ఎస్సీ, ఎస్టీలకు చెందిన ఐదుగురు నాన్-అఫీషియల్ సభ్యులు, ఇతర వర్గాలకు చెందిన ఎన్‌జీవోలతో అనుబంధం ఉన్న ముగ్గురు నాన్-అఫీషియల్ సభ్యులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం చేసిన సేవలకు సంబంధించిన వివరాలను బయోడేటాలో పొందుపరచాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి బయోడేటాతో కూడిన దరఖాస్తులను ఈ నెల 20వ తేదీలోగా జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయం, నిర్మల్‌లో సమర్పించాలని కోరారు.

# 108 సేవల మాదిరిగా మాజీ మంత్రి హరీశ్ రావు సేవలు -ఎమ్మెల్యేచింత ప్రభాకర్

## - హరీశ్ రావు జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం, ప్రభుత్వం ఆసుపత్రిలో పండ్ల పంపిణీ, అన్నదాన కార్యక్రమం

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 3 :

సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో , సదాశివపేట లో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి హరీశ్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించి సామాజిక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తదుపరి సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్, హరీశ్ రావు సమర్థవంతమైన నాయకుడని కొనియాడారు. అధికార పక్షంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల సమస్యలపై అదే స్థాయిలో స్పందిస్తూ పనిచేసే నాయకుడు హరీశ్ రావు అని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం హరీశ్ రావు పనితీరును మెచ్చుకునే వారని అన్నారు. హరీశ్ రావు మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని, ఆయురారోగ్యాలతో పాటు మరింత మేధస్సు, శక్తిని దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు హరీశ్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, డాక్టర్ శ్రీహరి, మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్ రెడ్డి, చింత సాయినాథ్, వేణుగోపాలస్వామి, సునీల్ జై, కౌన్సిలర్లు, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులు రోడ్లపై తిరిగితే సీజ్

## -సంగం వెంకటపుల్లయ్య, మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ భద్రాచలం

మణుగూరు, జూన్ 3 (భారతశక్తి):

పిల్లలు తల్లిదండ్రుల ఆశలు, దేశ భవిష్యత్తు అని, వారి భద్రతను కాపాడాల్సిన బాధ్యత విద్యా సంస్థల యాజమాన్యాలు, డ్రైవర్లు, సహాయకులతో పాటు రవాణా శాఖపై కూడా ఉందని భద్రాచలం యూనిట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య పేర్కొన్నారు. విద్యా సంస్థలకు చెందిన ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్లపై నడిపితే చట్టపరమైన చర్యలతో పాటు వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. బుధవారం రవాణా శాఖ భద్రాచలం యూనిట్ కార్యాలయం ఆధ్వర్యంలో మణుగూరు స్నేహ గార్డెన్స్‌లో మణుగూరు డివిజన్ పరిధిలోని విద్యా సంస్థల యాజమాన్యాల అసోసియేషన్ అధ్యక్షులు అరవింద్ కుమార్ అధ్యక్షతన, యాజమాన్యం ప్రతినిధులు,స్కూల్ బస్సు డ్రైవర్లు, సహాయకులకు రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

డ్రైవర్ మైండ్‌సెట్ సరిగ్గా ఉంటే అనేక ప్రమాదాలు నివారించవచ్చు

రోడ్డు ప్రమాదాలకు కేవలం వాహనం లేదా రోడ్డు పరిస్థితులు మాత్రమే కారణం కాదని, చాలావరకు డ్రైవర్ మైండ్‌సెట్ కూడా ప్రధాన పాత్ర పోషిస్తుందని తెలిపారు. డ్రైవర్ తన మానసిక స్థితిని సమతుల్యంగా ఉంచుకొని, రోడ్డు పరిస్థితులు, వాతావరణ పరిస్థితులు, వాహనం కండిషన్, ఆరోగ్య పరిస్థితి, వ్యక్తిగత అలవాట్లు, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని సరైన నిర్ణయాలు తీసుకుంటే అనేక రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, నిద్రమత్తులో వాహనం నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, కోపం, ఆందోళన లేదా ఇతర ఆలోచనలతో వాహనం నడపడం, అతివేగంగా ప్రయాణించడం వంటి అంశాలు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయని తెలిపారు. డ్రైవర్ అప్రమత్తత, ఓర్పు, క్రమశిక్షణ బాధ్యతాయుతమైన నిర్ణయాల ద్వారా తన ప్రాణాలతో పాటు తోటి ప్రయాణికుల విలువైన ప్రాణాలను కూడా కాపాడగలడని పేర్కొన్నారు.

స్కూల్ బస్సులకు ప్రత్యేక నిబంధనలు తప్పనిసరి

విద్యార్థుల భద్రత దృష్ట్యా ప్రతి విద్యా సంస్థ బస్సు రవాణా శాఖ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని తెలిపారు. ప్రతి బస్సుకు చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికేట్, పర్మిట్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ (పియుసి) ధృవపత్రాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అదేవిధంగా ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్, ఎమర్జెన్సీ ఎగ్జిట్, స్పీడ్ గవర్నర్, జీపీఎస్, అత్యవసర సంప్రదింపు వివరాలు వంటి భద్రతా సదుపాయాలు అందుబాటులో ఉండాలని తెలిపారు. స్కూల్ బస్సు డ్రైవర్‌కు కనీసం ఐదు సంవత్సరాల అనుభవంతో కూడిన చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, డ్రైవర్ వయస్సు 60 సంవత్సరాలు మించకూడదని పేర్కొన్నారు. అలాగే 15 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు గల బస్సులను విద్యార్థుల రవాణాకు ఉపయోగించరాదని స్పష్టం చేశారు.

విద్యార్థులు బస్సు ఎక్కే, దిగే సమయంలో అటెండెంట్ అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని, విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని సూచించారు. వాహనాల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించే విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్లపై నడిపితే సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

"ఎరైవ్-- ఎలైవ్" కార్యక్రమం లక్ష్యం ప్రాణాల రక్షణే

రాష్ట్ర ప్రభుత్వం, రవాణా శాఖ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ఎరైవ్-- ఎలైవ్" కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రతి ఒక్కరూ సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవడమేనని సంగం వెంకట పుల్లయ్య తెలిపారు. ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే ఎన్నో ప్రమాదాలను నివారించి విలువైన ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఉదయం బస్సులో ఎక్కే విద్యార్థి సాయంత్రం క్షేమంగా తన ఇంటికి చేరుకోవడమే అందరి లక్ష్యంగా ఉండాలని, పిల్లల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల ప్రతినిధులు ఎమ్ అరవింద్ కుమార్, జి మధు



సూదన్ రెడ్డి, ఎండి యుసబ్ షరీఫ్, ప్రతాప్ రెడ్డి, ఐజాక్ థామోస్, శ్రీనివాస్, చంద్ర మౌళి, సంపత్ రెడ్డి, జానిమియా ఖాన్, రామన్ రెడ్డి, నరేందర్ డ్రైవర్లు, సహాయకులు, రవాణా శాఖ సిబ్బంది భీముడు తదితరులు పాల్గొన్నారు.

# థెరానైమ్ బయోలాజిక్స్' ప్లాంట్ ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు


## - హాజరైన మంత్రి దామోదర్ రాజనర్సింహ, టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, అరబిందో చైర్మెన్ నిత్యానంద రెడ్డి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 3:



తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా మార్చే దిశగా మరో కీలక అడుగు పడింది. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బొర్పట్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన థెరానైమ్ బయోలాజిక్స్ తయారీ కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బుధవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు.ప్రముఖ ఔషధ సంస్థ 'అరబిందో ఫార్మా'కు చెందిన పూర్తి స్థాయి అనుబంధ విభాగమైన థెరానైమ్ బయోలాజిక్స్, దాదాపు రూ.1,000 కోట్ల భారీ పెట్టుబడితో ఈ అత్యాధునిక ప్లాంట్‌ను నిర్మించింది.ఈ భారీ ప్లాంట్ ఏర్పాటు ద్వారా స్థానిక ప్రాంతానికి చెందిన 1,500 మందికి పైగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి తెలిపారు.ఈ బయోలాజికల్ ప్లాంట్‌లో క్యాన్సర్, ఇతర ప్రాణాంతక వ్యాధుల చికిత్సలో ఉపయోగించే అత్యాధునిక బయోలాజిక్స్, జీవ రసాయన మందులను తయారు చేయనున్నారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే నాణ్యమైన ఔషధాలను అమెరికా సహా పలు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయనున్నారు. "మేడ్ ఇన్ తెలంగాణ" బ్రాండ్ ప్రతిష్టను ఇది ప్రపంచవ్యాప్తంగా మరింత పెంచుతుందని మంత్రి శ్రీధర్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు.థెరానైమ్ సంస్థ గ్లోబల్ ఫార్మా దిగ్గజం సింగపూర్ విభాగంతో కుదుర్చుకున్న మాస్టర్ సర్వీస్ అగ్రిమెంట్ లో భాగంగా ఈ కాంట్రాక్టుయో-మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంట్‌ను నిర్మించింది.ఈ ఫెసిలిటీలో అత్యాధునిక మేమాలియన్ సెల్ కల్చర్ బయోరియాక్టర్లతో పాటు, ఏడాదికి సుమారు 2.5 నుంచి 3 కోట్ల (25-30 మిలియన్) వయల్స్ ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉన్న ఐసోలేటర్ లైన్లను ఏర్పాటు చేశారు. తెలంగాణలో పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడమే కాకుండా, స్థానికులకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఫార్మా రంగ పెట్టుబడులకు తెలంగాణ ఎల్లప్పుడూ మొదటి ప్రాధాన్యతగా నిలుస్తుందని ఈ సందర్భంగా మంత్రి ?డి. శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, ఉన్నతాధికారులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి హరీశ్ రావును కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 3 :

హైదరాబాద్‌లో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు ను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి, ఆయురారోగ్యాలతో పాటు ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ, హరీశ్ రావు ప్రజలతో మమేకమై పనిచేసే నాయకుడని, ఆయన రాజకీయ ప్రస్థానం ఎంతోమంది యువ నాయకులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన నాయకుల్లో హరీశ్ రావు ఒకరని కొనియాడారు.జన్మదిన సందర్భంగా హరీశ్ రావుకు శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రజలకు మరింత కాలం సేవలందించేలా భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమలో బండారి లక్ష్మారెడ్డి ఉన్నారు .

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వెంటనే ముగించాలి:జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 03 (భారత శక్తి)వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వెంటనే ముగించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. దస్తురాబాద్ మండలంలోని బుట్టాపూర్, రేవోజిపేట్ గ్రామాలలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ధాన్యం కొనుగోలు తీరును పరిశీలించారు. అధికారులతో మాట్లాడుతూ, మండలంలోని మొత్తం కొనుగోలు కేంద్రాలు, వచ్చిన పంట దిగుబడి, ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం, గోదాములకు మిల్లులకు తరలించిన ధాన్యం, ఇంకా కొనుగోలు చేయాల్సిన ధాన్యం, అందుబాటులో ఉన్న హమాలీలు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ, కొనుగోలు ప్రక్రియ సక్రమంగా జరుగుతుందో లేదో అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలుపై రైతులు ఏమాత్రం ఆందోళన పడవలసిన అవసరం లేదని, ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని అన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఈ తనిఖీలలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, తహసిల్దార్ యాదవ రావు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విద్యా శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎల్. మల్లిఖార్జున్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 03: విద్యా శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎల్. మల్లిఖార్జున్ బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందించిన దృశ్యం.

త్రం ఆందోళన పడవలసిన అవసరం లేదని, ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని అన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఈ తనిఖీలలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, తహసిల్దార్ యాదవ రావు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# బదిలీ పై వెళుతున్న విద్యా శాఖ అధికారి రాజును శాలువాతో సన్మానించిన జిల్లా కలెక్టర్, విద్యా శాఖ సిబ్బంది

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 03 : బదిలీ పై వెళుతున్న విద్యా శాఖ అధికారి రాజును బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, టి ఎన్ జీ ఓఎస్, విద్యా శాఖ సిబ్బంది డిఈఓ రాజును శాలువాతో సన్మానించి వీడ్కోలు పలికారు.

# సదాశివనగర్ మండలం మోడేగాం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించిన జిల్లా కలెక్టర్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 03 : సదాశివనగర్ మండలం మోడేగాం గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు.

నిర్మాణాల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించి, పనులు వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు ఇల్లు కూలిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న లబ్ధిదారురాలు పిల్లి సాయవ్వతో కలెక్టర్ మాట్లాడారు. గతంలో పూరి గుడిసెలో నివసిస్తూ వర్షాలకు తన ఇల్లు కోల్పోయానని, ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇల్లు ద్వారా సురక్షితమైన నివాసం కలగబోతుందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, తమలాంటి పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కామారెడ్డి జిల్లాను గుడిసెలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం ద్వారా పేద కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, ప్రతి కుటుంబానికి సురక్షితమైన గృహం అందేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లలో పూరి గుడిసెలో ఉన్నవారిని గుర్తించి వారికి ఇళ్లు మంజూరు చేయాలని, ఎక్కడా కూడా పూరి గుడిసెలు కనిపించకూడదని, అధికారులు ప్రతీ గ్రామాన్ని పర్యటించి చర్యలు చేపట్టాలని, గ్రామీణ పేద కుటుంబాల ఆర్థిక సాధికారతకు స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఐకేపీ ఆధ్వర్యంలో రూ.1.59 కోట్లు 45 లక్షల బ్యాంకు రుణాలను 90 మంది లబ్ధిదారులకు మంజూరు చేయించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ రుణాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని, కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడే కార్యకలాపాలను చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా పేద కుటుంబాల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.కలెక్టర్ వెంట పీడీ హౌసింగ్ విజయపాల్ రెడ్డి, ఎమ్మార్వో సత్యనారాయణ, ఎంపిడిఓ, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శి, తదితరులు ఉన్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Published & Printed at Sri Muktheswara Publications, D.No. 4-2-252, Subhash Nagar, Hanmakonda, Warangal – 506001, Telangana. Fax: 040-24054446 ,Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, APTEL/2013/50560,Editor: Kesaram Penta Reddy